ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శనివారం | 12-09- 2026 | సంపుటి: 17, సంచిక: 161, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




గేట్స్ గ్రీన్ టాయిలెట్లకు

## హైదరాబాద్ వేదిక!

నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగం.. విద్యుత్ కనెక్షన్ అవసరం లేదు

### లుంబినీ పార్కులో తొలి నెట్ జీరో టాయిలెట్ల ప్రారంభం

### రూ.కోటితో ఏర్పాటు.. 50 యూనిట్లకు ఇప్పటికే ఆర్డర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ప్రజాకలం న్యూస్)ం నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదుగుతున్న హైదరాబాద్ మరో ప్రపంచస్థాయి సాంకేతికతకు వేదికగా నిలిచింది. బిల్ గేట్స్ ఫౌండేషన్ అభివృద్ధి చేసిన నెట్ జీరో, గ్రీన్ టాయిలెట్ల తయారీకి నగరం ఎంపికైంది. పర్యావరణహిత సాంకేతిక సంస్థ రీ–ఫ్లో, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని టీ–వర్క్స్, గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా అత్యాధునిక మరుగుదొడ్లను ఇక్కడ తయారు చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు సరఫరా చేయనున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన గ్రీన్ టాయిలెట్ల సముదాయాన్ని హైదరాబాద్‌లోని లుంబినీ పార్కులో ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సుమారు రూ.కోటితో ఏర్పాటు చేసిన ఈ టాయిలెట్లను అవసరమైన చోటుకు సులభంగా

తరువాయి 2వ పేజీలో...

విద్యా వ్యవస్థపై

# ప్రత్యేక కమిషన్

## పేదలకు న్యాయం జరగాలనే విద్య, న్యాయ శాఖలు తీసుకున్నా

### అసెంబ్లీలో విద్యా విధానంపై లఘు చర్చలో సీఎం రేవంత్ రెడ్డి

### చట్టాన్ని కేంద్రం ఆమోదించగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

### స్కిల్ డెవల్‌పమెంట్‌పై అధ్యయనానికి విదేశాలకు ఎమ్మెల్యేలు

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సన్నిహితుల కాలేజీలకే నిధులిచ్చింది



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజాకలం) : "నేను కమీషన్లు తీసుకుంటున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆ అవసరం నాకేంటి!? దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. కేవలం 17.5 ఏళ్లలోనే జడ్పీటీసీ నుంచి సీఎం దాకా అన్ని పదవులూ వచ్చాయి. కోట్ల మందిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఇచ్చాడు. విద్య, వ్యాపారం.. పెళ్లి, పిల్లలను ఇచ్చాడు. ఇంకా నాకు కక్కుర్తి ఎందుకు ఉంటుంది?'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తన బంధువులే జాతీయ నాయకత్వ స్థాయి వరకూ వెళ్లినా సీఎం కాలేకపోయారని, దేవుడు తనకు ఆ అవకాశం ఇచ్చాడని చెప్పారు. 'తెలంగాణ విద్యా విధానం'పై శుక్రవారం శాసన సభలో జరిగిన లఘు చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "నాకు డబ్బులే కావాలనుకుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఈపాటికి వేల కోట్లు సంపాదించి ఉండేవాడిని. పుప్పాలగూడ, మంచిరేవులలో నేను ఎకరాల్లో రియల్ వ్యాపారం చేస్తున్నప్పుడు మైహోం వంటి వాళ్లు హైదరాబాద్‌లో గజాల్లో వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. నాతో చదువుకున్నవారు ఇప్పుడు అమెరికాలో బిలియనీర్లుగా ఉన్నారు. నేనూ వాళ్లతో వెళ్లి ఉంటే సంపాదించుకుని ఉండేవాడిని. కానీ, అవేవీ మానసిక సంతోషాన్ని ఇవ్వవనే నేను ప్రజా జీవితంలోకి వచ్చాను. కేసీఆర్ కుటుంబంలా కక్కుర్తి పడే జాతకం నాది కాదు. నాతో ఉన్నవారికి సహాయం చేసే జాతకం నాది" అని వ్యాఖ్యానించారు. తనకు ఏమీ పైశాచిక కోరికలు ఉండవని, తాను ఇంటికి వెళ్లగానే రెండు నిమిషాల్లో నిద్ర పడుతుందని అన్నారు. ప్రస్తుతం జెన్‌జీ గురించి చర్చలు జరుగుతున్నాయని, కానీ తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటాలకూ ఉపయోగపడే విద్యా విధానం గురించి ఆలోచన చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...



రెజిమెంట్ ఆయుధాలు

## చోరీ చేసింది వీరే..

– కీలక వివరాలు వెల్లడించిన డీజీపీ

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజాకలం): దేశంలో సంచలనం సృష్టించిన బొల్లారం 20 మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఇదే రెజిమెంట్‌లో పని చేసి, ఇటీవలే సస్పెండైన మాజీ హవల్దార్ మల్లేశ్ అలియాస్ రాజు ఈ దొంగ తనం చేశాడని తేలింది. మల్లేశ్ ఎత్తుకెళ్లిన ఆయుధాలు, తూటాలను అన్నింటినీ స్వాధీనం చేసుకున్నామని శుక్రవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. తమ ప్రాథమిక విచారణలో మల్లేశ్ ఒక్కడే ఈ చోరీ చేశాడని నిర్ధారణ అయ్యిందని, అయితే, దీని వెనుక ఇతరులెవరైనా ఉన్నారా? ఆర్మీ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? ఉగ్రలింకులున్నాయా అనే విషయాలపై విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

అసెంబ్లీలోకి వెళ్లకుండా

# అడ్డుకున్నారు

## మా హక్కులకు భంగం కలిగించారు

### ప్రభుత్వానికి తొత్తుల్లా వ్యవహరిస్తున్నారు..

### 100 గంటలు దాటినా ఎఫ్ఐఆర్ లేదు

### ఎన్‌సీడబ్ల్యూ, ఎన్‌హెచ్‌ఆర్‌సీకి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 : తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఈ నెల 7న జరిగిన ఘటనపై బీఆర్ఎస్.. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)కు, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు ఫిర్యాదు చేసింది. మహిళా ప్రజాప్రతినిధులపై పురుష పోలీసులతో దాడి చేయించారని, అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించారని తెలిపింది. పోలీసులు చేసిన ఈ దాడులపై స్పందించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటున్నారని పేర్కొంది. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు



ఏకపక్షంగా, ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రహట్కర్‌ను, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు

తరువాయి 2వ పేజీలో...

# 22ఏ వెనుక రేవంత్ కుట్ర

## రాత్రికి రాత్రే పేదల ఇళ్లు, భూములు నిషేధిత జాబితాలోకి

### మంత్రి పొంగులేటి కి సిగ్గుంటే రాజీనామా చేయాలి – బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజాకలం) : రాష్ట్రంలోని పేదల ఇళ్లు, భూములను రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలోకి చేర్చి ప్రజలతో ప్రభుత్వం కన్నీళ్లు పెట్టిస్తోందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. వేలాది ఎకరాల భూములతో పాటు ఊర్లకు ఊర్లేనిషేధిత జాబితాలోకి వెళ్లటం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ వివాదంపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్‌రెడ్డి పాలన భూముల కేంద్రంగా సాగుతోందన్నారు. మూసీ ప్రాజెక్టు వెనుక దాదాపు 3 వేల ఎకరాల రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందని ఆరోపించారు. హైడ్రా చర్యల వెనుక కూడా భూ వ్యవహారమే ఉందని అన్నారు. సీఎం



సోదరుడి ఇల్లు, బడా బాబుల ఇళ్లు హైడ్రాకు కనిపించవని విమర్శించారు. హెచ్‌సీయూ, లగచర్ల భూములు, హిల్‌టాప్ పాలసీ, స్కిల్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ భూములు, హైడ్రా, మూసీ, మెట్రో వంటి అన్ని అంశాల వెనుకా భూ దోపిడీయే ఉందని ఆరోపించారు. భూభారతి పోర్టల్‌లో వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూముల వివరాలు పూర్తిగా కనిపించడం లేదని, 22ఏ నిబంధన ప్రభుత్వ భూములను కాపాడేందుకే అయితే ఆ భూముల వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు టీజీఐఐసీ భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేసిందని ప్రశ్నించారు. నిషేధిత జాబితా నుంచి భూములను విడిపించేందుకు 30 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన మాట అబద్ధమని మండిపడ్డారు. 2025 సెప్టెంబరులో 33 జిల్లాల కలెక్టర్లకు కొత్తగా నిషేధిత భూములను గుర్తించాలని ఆదేశాలు ఇచ్చారని, కలెక్టర్ల నివేదికల ఆధారంగా భూములను నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. అబద్ధాలు చెప్పిన మంత్రి పొంగులేటికి సిగ్గుంటే వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల

## వేతన కోత మెమో రద్దు చేయాలి

### శాసనమండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ ఎల్. రమణ



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం) తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్ల వేతనాలను తగ్గిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన మెమోను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ ఎల్. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలి సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన, నిత్యం ప్రజలకు సేవలందిస్తూ కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తగ్గించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాల్సిన సమయంలో ఉన్న వేతనాలను తగ్గించడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల వేతనాన్ని రూ.22,750 నుంచి రూ.16,600కు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాన్ని రూ.22,750 నుంచి రూ.19,500కు, డ్రైవర్ల వేతనాన్ని రూ.19,500 నుంచి రూ.16,600కు తగ్గించినట్లు తెలిపారు. ఈ వేతన కోతలతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులను భరించడం ఉద్యోగులకు భారంగా మారిందన్నారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన వేతన కోత మెమోను వెంటనే వెనక్కి తీసుకుని, గతంలో చెల్లించిన వేతనాలనే పునరుద్ధరించాలని మండలి చైర్మన్ ద్వారా ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ఎల్. రమణ కోరారు.

# ప్రపంచ ఆర్థిక వృద్ధి కంటే రెండింతల వేగంతో 'బ్రిక్స్' వృద్ధి

## బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతానికి, ప్రపంచ జీడీపీలో 40 శాతానికి, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరిగిందని మోదీ పేర్కొన్నారు. అదే సమయంలో బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు విస్తరించిందని చెప్పారు. అంటే ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక బలం దాదాపు రెండింతల వేగంతో పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. బ్రిక్స్ దేశాలు ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని ఈ సందర్భంగా మోదీ అన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు.. విస్తృత స్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు తమ దేశాల్లో రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలకు బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం.. వాటి భవిష్యత్తు సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని కొనియాడారు. బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న స్థాయి, వేగం, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయని మోదీ చెప్పుకొచ్చారు. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారం మరింత విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. భారత్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశం ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో అతిపెద్ద ఫోరమ్ అన్నారు. వివిధ దేశాల వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒకే వేదికపైకి రావడం ద్వారా కొత్త అవకాశాలకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోమారుతున్న పరిస్థితుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక సహకారం మరింత బలోపేతం కావడానికి ఈ వేదిక సహకరిస్తుందని ఆయన అన్నారు.

# విద్యా వ్యవస్థపై ప్రత్యేక కమిషన్

మొదటి పేజీ తరువాయి...

తలరాతని మార్చేది విద్య ఒక్కటేనని సంపూర్ణంగా విశ్వసించి.. ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నానన్నారు. "రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. ఈ విధానాన్ని కేంద్రం అడాప్ట్ చేసుకుని పీఎం సేత్ కార్యక్రమం చేపట్టింది. దాని కింద నాలుగు క్లస్టర్లనూ తెలంగాణకు తెచ్చుకున్నాం. కేంద్రం సహకరిస్తే అభినందనలు చెబుతూనే ఉంటాం. అలాగే, మా ప్రభుత్వం మంచి పనులు చేసినప్పుడు మాకూ అభినందనలు తెలపాలి" అని వ్యాఖ్యానించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని, కానీ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో 17 మందికి ఒకరు ఉన్నారని, అందుకే, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పది వేల మంది టీచర్లను రిక్రూట్ చేసినట్లు చెప్పారు. బడ్జెట్లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విద్యకు బడ్జెట్లో 6.53 శాతం కేటాయింపులుంటే.. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 8.53 శాతానికి పెంచానని, మూలధన పెట్టుబడిని కూడా కలిపితే ఇది 18 శాతం దాకా ఉంటుందని వివరించారు.

**విద్యా శాఖ అంటే నాకు ప్యాషన్**

విద్యా శాఖ అంటే తనకు ప్యాషన్ అని, అందుకే, ఆ శాఖను తన దగ్గర ఉంచుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. "విద్యా శాఖకు పూర్తిస్థాయి మంత్రి లేడని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అంటున్నారు. ఆ శాఖను సీఎం నిర్వహిస్తున్నాడంటేనే.. అన్నింటి కంటే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు. విద్యా శాఖ మంత్రి సమీక్ష చేస్తే ఆ శాఖ అధికారులు మాత్రమే వస్తరు. అదే ఒక సీఎం సమీక్ష చేస్తే.. మొత్తం సిస్టమే వచ్చి అక్కడ కూర్చుంటుంది. ఈ చిన్న తేడాను కూడా సభ్యులు గుర్తించట్లేదు" అని వివరించారు. పేదలకు న్యాయం జరగాలనే తాను విద్య, న్యాయ శాఖలను ఇష్టపడి తీసుకున్నానని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ విద్యను మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నానని, రెండేళ్లలో కొంత మెరుగుపడిందని, పట్టాలెక్కించిన తర్వాత పరుగులు పెడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ విద్య లేకపోవడం వల్లే ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరిక తగ్గుతోందని, అందుకే 4,100 స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంలో ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుతం ఆ స్కూళ్లలో 64 వేల మంది ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తున్నారన్నారు.

**ఆస్తులున్నవాళ్లు వెనకబడ్డారు**

"విద్య ఒక్కటే జీవితాల్లో మార్పు, వెలుగు తీసుకొస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 2024లో 'సీపెక్' సర్వే చేసింది. వివిధ కులాలు, ఉప కులాల ఆర్థిక, విద్య, సామాజిక, వెనుకబాటుకు సంబంధించి దీనిని చేశాం. ఇందులో ఓ కొత్త అంశం మా దృష్టికి వచ్చింది. సామాజిక వెనుకబాటుకు ఆస్తులు, అంతస్తులు కారణం కాదు. ఆస్తులున్న వారు సామాజిక వెనుకబాటుకు లోనయ్యారు. ఒక్క గుంట భూమి, ఎకరం వ్యవసాయ భూమి, సొంత ఇల్లు లేనివారు సామాజికంగా అగ్ర భాగాన ఉన్నట్లు తేలింది. దీనికి విద్య కారణమని తెలిసింది. దళితులు, ఆదివాసీల నుంచి వచ్చినవారు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎ?సలుగా రాణించి సామాజికంగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. ఇలాంటి వాళ్లకు సొంతంగా ఆస్తులేమీ లేవు. చదువుకోవడం వల్ల సామాజికంగా గౌరవం పొందుతున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో కురుమ సోదరులకు ఎకరాలకొద్దీ భూమి, వందలకొద్దీ గొర్రెలు, మేకలు, ఇంట్లో బంగారం అన్నీ ఉంటాయని, కానీ, పిల్లలను పెద్దగా చదివించకపోవడం వల్ల సామాజికంగా సమాజంతో కనెక్షన్ తెగిపోయిందని, వారు సామాజికంగా వెనుకబడినట్లు సర్వేలో తేలిందని వివరించారు. అందుకే, "చదువు ఒక్కటే మన తలరాతను మారుస్తుంది. దేశంలో క్లోజ్డ్ ఎకానమీ ఉన్నప్పుడు, సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లో లేనప్పుడు మన చదువు, మన ఉద్యోగం... ఊరు, సమితి, నియోజకవర్గం, జిల్లా, జోనల్ వ్యవస్థను దాటలేదు. కానీ, ఇప్పుడు ఓపెన్ ఎకానమీ! లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను పీవీ నర్సింహా రావు ప్రవేశపెట్టిన తర్వాత ప్రపంచ విద్యా విధానం అంతా మనకు అందుబాటులోకి వచ్చింది. ఈరోజు మనం ప్రపంచంతో పోటీ పడాల్సిన పరిస్థితి. అన్ని వ్యవస్థలు మారిపోయాయి. అందుకే, తెలంగాణ విద్యా విధానంలోని లోటుపాట్లను సవరించడానికి మొట్టమొదటిసారి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఇందులో కొన్ని అభ్యంతరాలుంటే... కె.కేశవరావు ఆధ్వర్యంలో మరో కమిటీని వేశాం. ప్రొఫెసర్ కోదండరామ్, శాంతా సిన్హాలను సభ్యులుగా నియమించాం. తెలంగాణలో మంచి విద్యా విధానాన్ని అమలు చేసుకోవడానికి మేధావులు, నిపుణులు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి" అని కోరారు. విద్యా విధానంపై చర్చ సందర్భంగా సభ్యులు ఇచ్చిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

**మోడల్ స్కూళ్లకు మోదీ ఒక్క రూపాయీ ఇవ్వలేదు**

మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకు వచ్చిన మోడల్ స్కూళ్లకు మోదీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని సీఎం రేవంత్ తప్పుబట్టారు. 2014 నుంచి ఈ స్కూళ్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోందన్నారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి గత ప్రభుత్వం చట్టాన్ని సవరించిందని, ఆమోదం కోసం దానిని కేంద్రానికి పంపితే.. రెండేళ్లపాటు పెండింగ్‌లో పెట్టిందని గుర్తు చేశారు. ఇటీవలే కొన్ని క్లారిఫికేషన్స్ అడిగితే పంపించామని, ఆ చట్టం ఆమోదం పొందగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతోనే అన్ని వర్సిటీలకు వీసీలను నియమించామని, ఇప్పుడవి అద్భుతంగా పని చేస్తూ ర్యాంకింగ్‌నూ పెంచుకున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణలతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య అదనంగా 87 వేలు పెరిగిందని, హాజరు శాతాన్ని 74 శాతానికి పెంచామని చెప్పారు. ఆలిండియా పెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో గతంలో 31వ స్థానంలో ఉన్న ప్రభుత్వ విద్యను 18వ స్థానానికి తెచ్చామన్నారు. అలాగే ఆలిండియా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో గతంలో 36వ స్థానంలో ఉండగా.. దాన్ని 26వ స్థానానికి తెచ్చినట్లు చెప్పారు.

**687 కోట్ల టెండర్లో 2 వేల కోట్ల అవినీతా!?**

"విద్యార్థులకు 9 రకాల వస్తువులతో స్కూల్ కిట్‌ను ఇస్తున్నాం. అందులో మఫత్‌లాల్ కంపెనీ దుస్తులతో యూనిఫాంలూ ఉన్నాయి. ఇందులో కూడా రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. అసలు దీనికి సంబంధించిన టెండరే రూ.687 కోట్లు. అందులో రూ.2 వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుం ది!?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదవాడి ఆకలి తీర్చడం తన బాధ్యతగా భావించి నర్సరీ నుంచి 12 తరగతి వరకు విద్యార్థులు, టీచర్లు, సిబ్బందికి బ్రేక్ ఫాస్ట్, లంచ్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం కోసం మెనూలో గుడ్డు, చికెన్, మటన్, రాగి వంటి జావలు అందిస్తున్నామని, సెంట్రల్ కిచన్‌ను డిజైన్ కూడా చేశామని చెప్పారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధ్యయనం చేయడానికి ఎమ్మెల్యేలను చైనా, జపాన్, జర్మనీ, సౌత్ కొరియా దేశాలకు పంపుతానని హామీ ఇచ్చారు. ఈ బాధ్యతను మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జర్మనీ, జపాన్, ఫిలిప్పీన్ లాంటి దేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేసేందుకు 500 మంది టీచర్లను పంపామన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉన్నవారినే ఆ దేశం వెనక్కు పంపుతోందని, వచ్చే ఐదేళ్లలో వచ్చే పది లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఎక్కడికి పోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకే, స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు."ఇక్కడ పెరిగినోడివి.. ఇక్కడ చదువుకున్నోడివి.. పిల్లల్ని ఇక్కడ చదివించినోడివీ కాదు. ఇక్కడి సమాజం గురించి నీకేం తెలుసు"అంటూ కేటీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పేద ప్రజల మధ్య పెరిగిన తనకు తెలుసునన్నారు. తాను ఆదివాసీలు, దళితులు, గిరిజనుల మధ్య పెరిగానని, ఊళ్లో పొద్దున లేస్తే మాదిగ ల పిల్లలతో ఆడుకునేవాడినని, వడ్డెర, చాకలి తదితర కులాల పిల్లలతో కలిసి పెరిగానని చెప్పారు.

# రెజిమెంట్ ఆయుధాలు చోరీ చేసింది వీరే..

మొదటి పేజీ తరువాయి...

మల్లేశ్ సోషల్ మీడియా ఖాతాల్లో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఆయుధాల డీలర్ వివరాలు ఉండటంతో.. ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకోవటం కోసం ఈ చోరీకి పాల్పడ్డాడా అన్న కోణంలోనూ దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు. డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 'మహబూబ్‌నగర్ జిల్లా జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ బొల్లారం సమీపంలోని బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. దేశ సైన్యంలో దాదాపు 16 ఏళ్లపాటు పని చేశాడు. క్రమశిక్షణారాహిత్యం కారణంగా ఈ ఏడాది జూన్ 30వ తేదీన అతడిని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ఆయుధాలను దొంగిలించాలని పథకం వేసి, గత నెల 27వ తేదీ నుంచి.. ఆయుధాలు భద్రపరిచే కోటే వద్దకు సాయంత్రం వేళల్లో వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ వచ్చాడు. 30వ తేదీ రాత్రి తన స్కూటీ వాహనంపై మద్రాస్ రెజిమెంట్‌లోకి వెళ్లి, వాహనాన్ని ఆయుధాల గదికి కొంచం దూరంలో చీకటి ప్రదేశంలో నిలిపి ఉంచాడు. తుపాకులు ఉన్న గది వద్దకు వెళ్లి తాళం, తలుపు పగులగొట్టి ఆయుధాలు తీసుకున్నాడు. వాటిని తన వాహనం వద్దకు తీసుకొచ్చి అక్కడ పెట్టి, తూటాలు తదితర మందుగుండు ఉన్న మరో గది వద్దకు వెళ్లాడు. దాని తాళం పగులగొడుతున్నప్పుడు ఆ చప్పుడు విని సమీపంలోని ఓ నైట్ గార్డు అటువైపు రాగా, మల్లేశ్ చీకట్లో దాక్కున్నాడు. గార్డు వెళ్లిపోయిన గంట తర్వాత ఆ గది తాళం పగులకొట్టి, తాను అప్పటికే దొంగిలించిన తుపాకులకు అవసరమైన తూటాలు తీసుకుని స్కూటీ వద్దకు వెళ్లాడు. తుపాకులను, తూటాలను తీసుకొని అక్కడికి రెండు కి.మీ.ల దూరంలో ఉన్న ఒక ఆలయం వద్దకు వెళ్లాడు. అయితే, మందుగుండు గది వద్ద వదిలిపెట్టిన మ్యాగజైన్ (తూటాల) కవర్స్‌ను తీసుకుని రాలేదని గుర్తించి, వాటి కోసం మళ్లీ వెనక్కువెళ్లి ఓ బ్యాగ్‌లో పెట్టుకుని వచ్చాడు. దారిలో సెక్యూరిటీ వాళ్లు ఎవరు అని దూరం నుంచి ప్రశ్నించగా 20 రెజిమెంట్ అని చెప్పి జారుకున్నాడు. ఆలయం వద్ద తుపాకులు, తూటాలను దాచిపెట్టి.. మాగ్యజైన్ కవర్స్ బ్యాగుతో ఉదయం 4.34కి తన ఇంటికి స్కూటీపై చేరుకున్నాడు. ఇంట్లో ఉన్న బ్రీజా కారు డిక్కీలో మ్యాగజైన్ కవర్స్ బ్యాగ్ పెట్టాడు. కారులో బయల్దేరి ఆలయం వద్దకు వెళ్లి అక్కడ దాచిన ఆయుధాలు, మందుగుండును డిక్కీలో వేసుకున్నాడు. అక్కడి నుంచి అచ్చంపేట వైపు బయల్దేరాడు. శ్రీశైలం ప్రధాన రహదారిలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రయాణించి సాగర్ రోడ్డులోకి వెళ్లాడు. సాగర్ రోడ్డులో తన కారులోకి నలుగురు ప్రయాణికులను ఎక్కించుకుని వారి వద్ద డబ్బులు తీసుకున్నాడు. తర్వాత దిండి వద్ద మరో ఇద్దర్ని ఎక్కించుకుని వారి వద్ద డబ్బులు తీసుకున్నాడు. అచ్చంపేటకు మధ్యాహ్నం చేరుకున్నాడు'. పోలీసు విచారణలో తన మీద అనుమానం రాకుండా ఉండటానికి.. ఉద్యోగం పోతే క్యాబ్ నడుపుతున్నట్లు సాక్ష్యాధారాలను సృష్టించుకోవడానికి మల్లేశ్ ఆరుగురు ప్రయాణికులను ఎక్కించుకున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ వివరించారు.

ఇంటికి చేరుకున్న తర్వాత ఆయుధాలను గడ్డివాములో దాచి వాటిపై చెత్త వేశాడని తెలిపారు. అయితే, తర్వాత రోజుల్లో దర్యాప్తులో భాగంగా పోలీసులు తన ఇంటికి రావడానికి ముందు 6వ తేదీన ఆయుధాలను తీసుకుని పస్రా గ్రామంలో ఒక ఇంట్లో దాచాడని, పోలీసులు వచ్చి వెళ్లిన తర్వాత 8వ తేదీన మళ్లీ ఆయుధాలను తీసుకొచ్చి ఇంట్లోని గడ్డివాము కింద గుంత తీసి దాచాడని పేర్కొన్నారు. మల్లేశ్ ఒక్కడే ఈ దొంగతనం చేశాడా? అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుగుతోందని, దొంగతనం తర్వాత మల్లేశ్ ఆయుధాల గది ఇన్‌చార్జితో మాట్లాడిన కాల్ డిటైల్స్ ఉన్నాయని ఆనంద్ తెలిపారు. మల్లేశ్ సోషల్ మీడియా ఖాతాలో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఆయుధాల డీలర్‌ను ఫాలో అవుతున్నట్లు వెల్లడైందని, ఆ డీలర్ ఇన్‌స్టాలో షాట్‌గన్స్ ఇతర ఆయుధాల వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయుధాలను విక్రయించటం కోసం ఈ చోరీ చేశాడా అన్న కోణాన్నీ పరిశీలిస్తున్నామని చెప్పారు. అయితే, తనను ఉద్యోగం నుంచి తొలగించారన్న కోపంతో ఆవేశంలో చేసిన పనిగానే ప్రాథమికంగా అనుమానిస్తున్నామని డీజీపీ తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీటీవీలు రాత్రి పూట పని చేయవనే విషయం మల్ల?షకు తెలుసని పేర్కొన్నారు. ఇందులో ఇతర వ్యక్తుల పాత్రపై సైన్యం ఇంటెలిజెన్స్ విచారణ జరుపుతుందని, భద్రతా వైఫల్యాలున్నాయా అనే విషయంలో తాము కామెంట్ చేయదలచుకోలేదని డీజీపీ స్పష్టం చేశారు.

**వీడని చిక్కుముడులెన్నో...**

సైన్యానికి సంబంధించిన ఆయుధాల చోరీ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి, ఆయుధాలన్నింటినీ పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికి దర్యాప్తులో వీడని చిక్కుముడులెన్నో కనిపిస్తున్నాయి. మల్లేశ్ ఏ ఉద్దేశంతో చోరీ చేశాడు అన్నది కీలకంగా మారింది. ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌లో ఆయుధాల అమ్మకాలకు సంబంధించిన నలుగుర్ని మల్లేశ్ ఫాలో అవుతున్నట్లు సమాచారం.

అంటే, అమ్మడం కోసమే ఆయుధాలు దొంగిలించాడా? 16 ఏళ్లు సైన్యంలో పని చేసిన మల్లేశ్ మరో మూడేళ్లలో రిటైర్ కావాల్సి ఉంది. ఇటువంటప్పుడు తనను క్రమశిక్షణ చర్యల కింద పెన్షన్ అవుట్ కింద తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోయాడా? తన పై అధికారులకు శిక్ష పడాలని ఆయుధాలను దొంగి లించాడా? అలాగైతే, తనను సర్వీసు నుంచి తొలిగించిన నాటి నుంచి చోరీకి పాల్పడిన నాటికి మధ్యనున్న రెండు నెలలపాటు ఏం చేశాడు? దొంగతనం ఎప్పటికైనా బయట పడుతుందని తెలిసే ఏవేవో సాకులు సృష్టించుకోవడానికి ప్రయత్నించాడా? మద్రాస్ రెజిమెంట్‌లోని కొందరు ఉన్నతాధికారులతో అతనికున్న పరిచయాలేమిటి? వంటి పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# గేట్స్ గ్రీన్ టాయిలెట్లకు హైదరాబాద్ వేదిక!

మొదటి పేజీ తరువాయి...

తరలించుకునే సదుపాయం ఉంది.

**నీరు.. పదేపదే శుద్ధి**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సోలార్ విద్యుత్‌తో పనిచేసే ఈ టాయిలెట్లకు ప్రత్యేకంగా విద్యుత్ కనెక్షన్ అవసరం లేదన్నారు. ఒకసారి ట్యాంకులో నీటిని నింపితే.. అదే నీటిని అత్యాధునిక విధానంలో పలుమార్లు శుద్ధి చేసి తిరిగి వినియోగించుకునే సదుపాయం ఉందని తెలిపారు. తక్కువ నీటి వినియోగంతో పాటు విద్యుత్ అవసరం లేకపోవడం వల్ల వీటిని ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే వీలుందని చెప్పారు.

**ప్రపంచానికి హైదరాబాద్ నుంచే**

గేట్స్ ఫౌండేషన్ పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని శ్రీధర్‌బాబు అన్నారు. ఈ సాంకేతికతకు ఎలాంటి రాయల్టీ భారం లేకపోవడంతో తక్కువ ధరలో గ్రీన్ టాయిలెట్లను తయారు చేసి అందించవచ్చని తెలిపారు. రీ-ఫ్లో సంస్థ టీ-వర్క్స్‌తో కలిసి వీటిని హైదరాబాద్‌లోనే ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి 50 యూనిట్లకు ఆర్డర్లు వచ్చాయని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు, ఇతర దేశాలకు ఈ పర్యావరణహితటాయిలెట్లను సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి అర్చనా వ్యాస్, రీ-ఫ్లో ప్రతినిధి అభిషేక్, టీ-వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు

మొదటి పేజీ తరువాయి...

విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ ఫుటేజీలను భద్రపరిచేలా ఆదేశాలివ్వాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధులు కోరారు. ఈ బృందంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు ఉన్నారు. ఫిర్యాదు అనంతరం సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, "ప్రజా సమస్యలపై పోరాడాల్సిన మేము.. మమ్మల్ని రక్షించుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. అసెంబ్లీలో అడుగుపెట్టకముందే పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. నడిరోడ్డుపై నా గొంతు నులిమి, సహచర ఎమ్మెల్యే చీర, జుట్టు పట్టుకుని లాగారు. 20, 30 ఏళ్లుగా ప్రజాప్రతినిధులుగా ఉన్న మా పట్ల పురుష పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత అవమానకరం. దాడి జరిగి 100 గంటలు దాటినా ఎఫ్ఐఆర్ లేదు. పైగా, తిరిగి మాపైనే కేసులు పెట్టారు" అని మండిపడ్డారు.

**చీర లాగి అవమానపరిచారు: సునీత**

అసెంబ్లీ సాక్షిగా పురుష పోలీసులు తన చీర లాగి అత్యంత హేయంగా ప్రవర్తించారని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని, రాష్ట్రంలో న్యాయం జరగకే ఢిల్లీకి వచ్చామని తెలిపారు.

# సంస్కార్ విద్యాలయ లో హిందీ దివస్ సంబరాలు



సెప్టెంబర్ 10, పెద్ద శంకరం పేట, ప్రజాకలం ప్రతినిధి

జాతీయ హిందీ దినోత్సవం సెప్టెంబర్ 14 ను పురస్కరించుకొని పెద్ద శంకరం పేట సంస్కార్ విద్యాలయ లో ముందుగా హిందీ దివస్ ను ఘనంగా నిర్వహించారు. హిందీ మన జాతీయ భాష అని, మన దేశ సంగ్రతకు దోహదమైనదని అంతటి ప్రాముఖ్యత గల భాష మార్కుల కోసం ఒక సబ్జెక్ట్ లాగా కాకుండా మాతృ భాష లాగే నేర్చుకోవాలని ఉపాధ్యాయ బృందం చిన్నారులకు వివరించారు... ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యార్థులకు హిందీ భాష మీద ఉపన్యాసం, వ్యాస రచన పోటీలు,చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు.. హిందీ పాటల పై చిన్నారుల చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమం లో ప్రిన్సిపల్ కవితా గౌడ్ హిందీ ఉపాధ్యాయురాళ్లు అనితా, రమ్య శ్రీ తో పాటుగా మిగితా ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం

- ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల విస్తరణ
- కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక పర్యవేక్షణ తో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం
- త్వరలో ఎంఆర్ఐ సేవలు.. ఇప్పటికే అందుబాటులోకి మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు
- రోగిని కదిలించాల్సిన అవసరం లేకుండా పడక వద్దే ఎక్స్‌రే

ఖమ్మం సెప్టెంబర్ 11( ప్రజా కలం న్యూస్)

ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మార్చేలా ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆధునిక వైద్య పరీక్షలు, అధునాతన స్కానింగ్ సదుపాయాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు వంటి అనేక సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతోంది. ఖరీదైన పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అనేక ఆధునిక సేవలు అందుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి మరింత ఊతం లభిస్తోంది.

**మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి:** ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి కొత్తగా 3 పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది.

**త్వరలో ఎంఆర్ఐ.. కలెక్టర్ చొరవతో సివిల్ పనులు వేగవంతం:** ఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేయిస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌళిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు. మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది.

**పడక వద్దే ఎక్స్‌రే.. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఉపశమనం:** సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది.తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీ-హబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.

**జనవరి-ఆగస్టులో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు:** ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు.జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది.

**మాతా శిశు సంరక్షణలో 16,961 స్కాన్లు:** గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి. నెలవారీగా పరిశీలిస్తే



ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి.ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**గర్భంలోని శిశువు ఆరోగ్యం ముందుగానే తెలుసుకునే అవకాశం:** మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు. సర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించడం, రక్త నాళాల్లో ఏర్పడే అడ్డంకులను గుర్తించడం వంటి వాటికి ఈ పరీక్ష ఉపయోగపడు తుంది.

## ఎస్‌జీ ట్రేడర్స్ ప్రారంభోత్సవంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా కలం)

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌జీ ట్రేడర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి యుడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు హాజరై సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా వ్యాపార రంగంలో అడుగుపెడుతున్న ఎస్‌జీ ట్రేడర్స్ ప్రజల నమ్మకాన్ని పొందుతూ మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారుల ఆదరణ పొందేలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోస్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడటం వల్ల ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. ఎస్‌జీ ట్రేడర్స్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీ ట్రేడర్స్ యాజమాన్యం, మమ్మద్ అజీమ్, అఫ్రోజ్, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షుడు లోక రమణ రెడ్డి, మెట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, ఐజేయు స్టేట్ కౌన్సిల్ మెంబర్ గోపాల చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపూర్ణ చారి, జిల్లా ఈసీ నెంబర్ హరీష్ మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ 20వ వార్డు కౌన్సిలర్ మాసాల ప్రవీణ్, శ్రీనివాస్ వ్యాపార ప్రముఖులు, స్నేహితులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**– విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలి – ఎస్పీ అశోక్ కుమార్**




జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్11 (ప్రజాకలం)

జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించే క్రమంలో శుక్రవారం సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై కూడా ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు.ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచుగా సందర్శిస్తూ స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సంఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, ఊరేగింపు మార్గాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్ఐ గీతతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కౌన్సిల్ అత్యవసర సమావేశం

**– ఆరు అంశాలకు ఏకగ్రీవ ఆమోదం**



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం) మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ మైలారపు లింబాద్రి అధ్యక్షతన



శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం ఆరు అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందుంచగా, సభ్యులు వాటికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లో ప్రస్తావిస్తున్న సమస్యలను నిధుల లభ్యతను బట్టి విడతల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని కోరారు. వినాయక చవితి పండుగను పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. ఇంకా సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి, జేఏఓ రమేష్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లలిత కళా సమితి స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

**– మున్సిపల్ కమిషనర్‌కు కళా సమితి ప్రతినిధుల వినతి**

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం): పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల లలిత కళా సమితి భవన ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కళా సమితి ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కళా సమితి స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన బేస్‌మెంట్‌ను ప్రైవేట్ జేసీబీతో ధ్వంసం చేసి, కందకం తవ్వి బేస్ వేసినట్లు వారు ఆరోపించారు. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా సంస్థ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి రెడీమేడ్ ప్రీకాస్ట్ వాల్స్ నిర్మించి, వాటికి రంగులు కూడా వేసినట్లు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకుని లలిత కళా సమితికి న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కళా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, మెట్‌పల్లి కీర్తి పతాకగా, కళారంగ వైభవానికి ప్రతీకగా నిలిచిన లలిత కళా సమితిని, కళాకారులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమస్యను వీలైనంత త్వరగా అధికారులు పరిష్కరించాలని కోరారు. సమస్యకు పరిష్కారం చూపకపోతే సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల ఎదుట మౌన దీక్ష చేపట్టడంతో పాటు, వివిధ కళా సంస్థలు, సంఘాలు, పట్టణ



ప్రముఖులు, రాజకీయ నాయకుల మద్దతుతో తదుపరి నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. పట్టణంలోని కుల సంఘాలు, వ్యాపార సంఘాలు, యువజన సంఘాలు, సంక్షేమ సంఘాలు, పట్టణ ప్రముఖులను కలిసి మద్దతు కూడగట్టి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. లలిత కళా సమితిపై దాడి అంటే మెట్‌పల్లి పట్టణ గౌరవానికే అవమానం. పట్టణ గౌరవానికి ప్రతీకగా నిలిచిన సంస్థను కాపాడుకునే ప్రతి కార్యక్రమంలో తామంతా కలిసి వస్తాం అని పట్టణ ప్రముఖులు సంస్థ సభ్యులకు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లలిత కళా సమితి అధ్యక్షులు గోధూరు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య, జాయింట్ సెక్రటరీ మర్రి భాస్కర్, కార్యవర్గ సభ్యులు విజయులు, మానాల రాజారాం, వర్మ, అనంతం, నాగభూషణ్, రహీం, జయవీర్, శేఖర్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి సన్నిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతుల ప్రత్యేక పూజలు



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం):

జగిత్యాల పట్టణంలోని పురాణిపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దేవాలయం 64వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చైర్‌పర్సన్ దంపతులను అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**పోచమ్మ తల్లి ఆలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక పూజలు**

జగిత్యాల: పట్టణంలోని పురాణిపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దేవాలయం 64వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కమిషనర్ ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కమిషనర్‌ను అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మండల స్థాయి పురస్కారాలు

**– విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాలల అభివృద్ధికి విశేష కృషికి గుర్తింపు**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం): విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసిన 14 మంది ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. శుక్రవారం కోరుట్ల మండలంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ అలీ ముఖ్య అతిథులుగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కోరుట్ల మండలాన్ని విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల నిబద్ధత, కృషి, సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, ఎంపీడీఓ సూపరింటెండెంట్ చక్రధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి. ఆనందరావు, వి. గంగాధర్, జోష్ణ, భారీ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## తోటి పాత్రికేయున్ని సన్మానించిన పాత్రికేయులు

గొల్లపల్లి, సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొమ్మెన కుమార్, సాక్షి దినపత్రిక లో గత 18 ఏళ్లుగా సుదీర్ఘకాలంగా పాత్రికేయుడిగా విశేష సేవలందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తూ పత్రికా విలువలకు కట్టుబడి పనిచేస్తున్న వారి సేవలను గుర్తించిన యాజమాన్యం ఈ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోనీ వైశ్య భవన్‌లో తోటి పాత్రికేయ మిత్రులు బొమ్మెన కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మెన కుమార్ మాట్లాడుతూ. 18 ఏళ్ల ఈ సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానంలో ఈ పురస్కారం దక్కడం ఎంతో సంతృప్తిని, గర్వాన్ని ఇచ్చిందని క్షేత్రస్థాయిలో తాను చేస్తున్న పనితీరును గుర్తించి ప్రోత్సహించిన సాక్షి దిన పత్రిక యాజమాన్యానికి, నిరంతరం వెన్నంటి నిలుస్తున్న తోటి పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను



పెంచిందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చిర్ర దిలీప్ ,నర్సాపురం రవీందర్, పొలాస గంగాధర్, భోజనపు శ్రీనివాస్,బోదుగం గంగాధర్, చౌటపెల్లి తిరుపతి,పొన్నం స్వామి గౌడ్,ఎండి ఖాజానియా,అంకం భూమయ్య, ముస్కు అభిషేక్ రెడ్డి, జంగిలి సత్యం, కచ్చు కొమురయ్య,మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో రౌడీషీటర్లుకు పోలీసుల కౌన్సెలింగ్

**గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం): గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్‌కు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాల సమయంలో



ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా గొడవలు, నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు సహకరించాలని, ప్రజలతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్ఐ జి. శ్యామ్ రాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర కీలకమైనది

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి. సెప్టెంబర్ 11

అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గాంధారి వనం ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అడవి అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి హాజరై అటవీ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతుందని, ఈ క్రమంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారులు విశిష్ట కృషి చేస్తారని తెలిపారు. ఆదివాసి గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించినట్లు అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

**– బెల్లంపల్లి సర్కిల్ సర్కిల్ ఇన్స్పెక్టర్స్ : శ్రీనివాస్, హానోక్**

బెల్లంపల్లి టౌన్: సెప్టెంబర్ 11, (ప్రజా కలం )ప్రతినిధి... గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో , శాంతియుతంగా జరుపుకోవాలని బెల్లంపల్లి టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్ ,హనొక్ ప్రజలకు సూచించారు.వినాయక మండపాల నిర్వాహకులు తాము అందుబాటులో తెచ్చిన ఆన్లైన్ యాప్ లో పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. గణేష్ మండపం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పాటించాల్సిన నియమ నిబంధనలను తెలిపారు. వినాయక మండపానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంట్ అందజేస్తుందని, మండపం వద్ద ఏలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక,నీరు మండపం సమీపమం లో ఉండేటట్టు చూసుకోవాలన్నారు.మండపని ఇద్దరు వాలెంటరు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మండపం వద్ద పేకాట,జూదం,ఎవరినైనా బనాయించడం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఏలాంటి డీజే సౌండ్స్ పెట్టరాదని,ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్య తీసుకుంటామన్నారు.నిమజ్నం వద్ద చిన్నపిల్లలను మహిళలను దూరంగా ఉంచాలని సూచించారు.సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల 100 పోలీసుల బందోబస్తు ఉంటుందని, దొంగతనాలు,నేరాలు జరగడానికి అవకాశం ఉండదన్నారు.ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలన్నారు...ఈ కార్యక్రమంలో గణేష్ మండపం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు..



ప్రజా కలం
శనివారం, సెప్టెంబర్ 12, 2026

# ఎట్లా ఇచ్చేది?

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల్లో కీలక భూమిక నిర్వహించింది తెలంగాణ ఉద్యోగ వర్గం. తెలంగాణ వస్తే మెరుగైన ఉద్యోగ జీవితం ఉంటుందని, ఆంధ్ర ఆధిపత్య వివక్షలు ఉండవని, వివిధ వర్గాలకు న్యాయబద్ధమైన సామాజిక వాటాలు ప్రత్యేక రాష్ట్రంలోనే పొందగలమని ఉద్యోగులు ఆశించారు. కానీ జరిగింది అందుకు విరుద్ధం. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేసింది. నెల నెలా మొదటి తారీఖున జీతాలు పొందడాన్ని కూడా ఒక డిమాండ్‌గా దిగజార్చిన దుస్థితికి నెట్టివేసింది. డీఏలు ఇవ్వకపోవడం, పీఆర్సీ అమలు చేయకపోవడం, పెన్షనర్ బెనిఫిట్స్‌ను పెండింగ్‌లో పెట్టడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను పాత పెన్షన్ స్కీమ్‌గా మార్చకపోవడం, హెల్త్‌కార్డులను ఉచితంగా ఇవ్వకపోవడం... ఇంకా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఉద్యోగులను, పెన్షనర్స్‌ను ఇబ్బందులపాలు చేసినందుకు గత ప్రభుత్వం ఫలితం అనుభవించింది. ఇప్పటి ప్రభుత్వం కూడా ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆరు డీఏలను ఇవ్వడం లేదు. పీఆర్సీ అమలును పట్టించుకోవడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు తాము ఉద్యోగంలో ఉన్నప్పుడు దాచుకున్న సొమ్మును ఇవ్వడం లేదు. పైగా పెన్షనరీ బెనిఫిట్స్ ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వాలనీ, ఒక్కో ఉద్యోగికి సగటున కోటి పైనే చెల్లించాల్సి వస్తున్నదనీ, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి ఇస్తున్నామనీ ముఖ్యమంత్రి వాపోతున్నారు! ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చేది ఒక్క గ్రాట్యుటీ మాత్రమే. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రిటైర్ అయ్యేదాకా ఒక ఉద్యోగి తన జీతం నుంచి పైసా పైసా ప్రభుత్వం దగ్గర దాచుకున్న సొమ్మే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్స్. ఇవేమీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే కానుకలు కావు. ఉద్యోగుల జీతం సొమ్ము వారికి ఇవ్వకుండా... 'ఎట్లా ఇచ్చేది? ఎక్కడ నుంచి అప్పులు తెచ్చేది? కోసినా ఒక్క పైసా లేదు, ఉచితాలు తీసి ఇవ్వాలా?' అని సమాజం ముందు ఉద్యోగులను బద్నాం చేయడం అన్యాయం. ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రజలను ప్రత్యర్థులుగా నిలబెట్టే ప్రయత్నం మంచిది కాదు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ము ఏమైంది? ఎటు మళ్లిస్తున్నారు? తెలంగాణ రాకముందు పెన్షనర్స్ పెండింగ్ బిల్స్ అంటూ లేకుండేది. ఒకటీ అరా డీఏలు పెండింగ్ ఉండేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక, ఆరు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయి! బహుశా దేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం మనదేనేమో! మిగతా ఏ రాష్ట్రంలోనూ ఈ దుస్థితి లేదు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భాగమే. వారు లేకుండా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేయవు. ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవుల్లో ఒక్కరోజే ఉన్నా కూడా వారికి పెద్ద ఎత్తున జీతం, పెన్షన్ వస్తుంది. దీని మీద చర్చే ఉండది. ఉద్యోగుల లాగా వారు వారి జీతం నుంచి దాచుకునేది ఏమీ ఉండది. కానీ, ఉద్యోగులు ముప్పై నలభై ఏండ్ల పాటు పనిచేసి కూడబెట్టుకున్న సొమ్మును వారికి ఇవ్వడానికి ఇంత కాలయాపనా?! ఇంకోవైపు ప్రభుత్వ ధనమే తేరగా ఇస్తున్నట్లు ప్రచారం! ఇట్లా ఉద్యోగులను వేలెత్తి చూపే పద్ధతి ఇవ్వాల్టిది కాదు. గత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల నుంచీ ఇదే జరుగుతున్నది. పెన్షనర్లు దాచుకున్న సొమ్ము వారికి అందక ఈ రెండున్నరేళ్లలో డెబ్బయిమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. పిల్లల చదువులు, పిల్లల పెళ్లిళ్లు, సొంతింటి ఏర్పాట్లు, అప్పులు, అనారోగ్యాలు... ఇన్ని సమస్యల నుంచి దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్స్‌తో బైటపడదామంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసి ఇవ్వకపోవడం వల్ల జరిగిన ఆత్మహత్యలు అవి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యంగా ఇచ్చే డీఏ ప్రభుత్వ భిక్ష కాదు, ఉద్యోగుల హక్కు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్ల నుంచి డీఏ ఇవ్వడం లేదు. ప్రభుత్వం దగ్గర ఒక్క పైసా లేదు అంటూనే, అనేక బహుళ ప్రాజెక్టులను చేపడుతున్నది. గత దశాబ్దాల నుంచీ ఏ ప్రభుత్వాలూ పీఆర్సీలను సక్రమంగా అమలు చేసిన చరిత్ర లేదు. దానివల్ల వేతన సవరణ జరగడం ఆగిపోయి, కొత్త వేతనాలు అందడం లేదు. ఈ మధ్య క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల విషయంలో కూడా బోర్డు ఏర్పాటు, రెఫరల్ హాస్పిటల్ లిస్ట్, కొత్త హెల్త్ కార్డులు ఇవ్వక మునుపే, ఆస్పత్రుల ఓపీ సేవలకు సంబంధించిన అంశాలను పూర్తి చేయకముందే హడావిడిగా ఇప్పటికి అయిదు నెలల నుంచి ఉద్యోగులు, పెన్షనర్స్ నుంచి ఒకటిన్నర శాతం (1.5శాతం) కట్ చేయడం దారుణం. అసలే బెనిఫిట్స్ రాక అల్లాడుతున్న పెన్షనర్ల పెన్షన్ నుంచి హెల్త్ కార్డులు రాకుండానే ఇలా కట్ చేయడం ఆపాలి. ఉద్యోగులు, పెన్షనర్లకు అప్పుబడిన ఆరు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. పెన్షనర్స్ దాచుకున్న పెండింగ్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలి. పీఆర్సీని అమలు చేయాలి.

## కోజన్ కొత్తూర్ గ్రామంలో ఆత్మ క్షేత్ర ప్రదర్శన

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 11( ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్గ్రామంలోఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మానేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు సన్న రకాల వరి సాగు ప్రోత్సాహం నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులకు నానో ఎరువులను అందించి, వాటి వినియోగ విధానాన్ని ప్రత్యక్షంగావివరించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ ప్రసాద్, ఏఈఓ వినోద్, సాగర్. రైతులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల కృషితోనే విద్యారంగంలో జిల్లా ముందంజ



## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరై డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెరగడంలో ఉపాధ్యాయుల కృషి కీలకమని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులలో నమ్మకం పెంపొందించేందుకు ఉపాధ్యాయుల అంకితభావం ప్రధాన కారణమని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో సైతం విద్యార్థుల నమోదును మరింత పెంచడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు, బోధనలో నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్‌ను పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం ఉపాధ్యాయ వృత్తిలో కీలకమైన బాధ్యత అని తెలిపారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ అదే లక్షణాలను విద్యార్థులలో పెంపొందించాలని, విభిన్న బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. సాంకేతికత ఆధారంగా ప్రతి ఒక్కరికీ నేర్చుకునే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వసతి తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ అందించామని, ఎప్పటికప్పుడు నూతన విద్యా విధానాలను, సాంకేతికతను నేర్చుకుంటూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి విమర్శలు వచ్చినా వాటిని నిర్మాణాత్మకంగా స్వీకరించి విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడేలా పని చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యార్థుల నమోదు, ఉత్తీర్ణతలో ముందు వరుసలో ఉండటం ఉపాధ్యాయ వర్గానికే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనలో, పాఠశాలల అభివృద్ధిలో తమ వంతు పాత్ర, అనుభవాలను వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 27 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఎన్రోల్మెంట్ సాధించిన 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవార్డులు, ఎన్.ఎం.ఎం.ఎస్. ద్వారా అధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లు సాధించిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్.ఎస్.సి. ఎన్రోల్మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.అనంతరం జిల్లా కలెక్టర్‌ను అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పంట ఎండకముందే ప్రభుత్వం స్పందించాలి

**- ఎస్సారెస్పీ నుంచి వెంటనే 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలి**
**- కాలువ ఉన్న రైతుకు నీరు లేదు.. బోరు ఉన్న రైతుకు కరెంట్ లేదు**
**- టీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్. రఘు**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం): కోరుట్ల నియోజకవర్గంలోని వరి రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు అన్నారు. ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.మొత్తం సీజన్‌లో పంటకు అవసరమైన సమయంలో సరైన వర్షాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కనీసం బోర్లు, మోటార్ల ద్వారా నీటిని అందించేందుకు ప్రయత్నించినా గత ఆరు నెలలుగా విద్యుత్ కోతలు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. విద్యుత్ కోతల కారణంగా సాధారణ ప్రజలతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పంటలకు నీరు అందక చివరకు ఇబ్రహీంపట్నం, కోరుట్ల ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రఘు అన్నారు.రైతు పొలం వదిలి రోడ్డెక్కాడంటే సమస్య తీవ్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. గంగనాల కాలువపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.మల్లాపూర్ మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని రఘు తెలిపారు. మెట్‌పల్లి–ఇబ్రహీంపట్నం పరిధిలోని రైతులు గంగనాల కాలువ నీటిపై ఆధారపడుతున్నారని, నీటి లభ్యత లేక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. గంగనాల కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించేందుకు రైతులే శ్రమదానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాలువల నిర్వహణ, పూడిక తొలగింపు, నీటి ప్రవాహం సక్రమంగా ఉండేలా చూడటం సంబంధిత శాఖల బాధ్యత అని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంగనాల కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పరిస్థితి మరింత తీవ్రం అయ్యే వరకు ప్రభుత్వం వేచి చూడకుండా ఎస్సారెస్పీ నుంచి కనీసం 10 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని డా. రఘు డిమాండ్ చేశారు. విడుదల చేసిన నీరు ప్రధాన కాలువలకే పరిమితం కాకుండా చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.కాలువ ఉన్న రైతుకు నీరు లేదు.. బోరు ఉన్న రైతుకు కరెంట్ లేదు.. మరి రైతు తన పంటను ఎలా కాపాడుకోవాలని రఘు ప్రశ్నించారు. కాలువ నీరు అందని రైతు బోర్లపై ఆధారపడాల్సి వస్తుందని, అయితే బోర్లు ఉన్నా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటే వాటి వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రైతును రెండు వైపులా ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రోడ్డెక్కిన తర్వాత ప్రభుత్వం స్పందించడం కాదు రైతు పంట ఎండకముందే స్పందించాలన్నారు. ఎస్సారెస్పీ నుంచి వెంటనే 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. గంగనాల కాలువతో పాటు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి. వ్యవసాయానికి కరెంట్ కోతలు లేకుండా చూడాలి. పంట ఎండిన తర్వాత పరిహారం ఇవ్వడం పరిష్కారం కాదని, పంట ఎండకుండా కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని రఘు అన్నారు.



## బ్యాంకు ఉద్యోగాల్లో మెరిసిన 'గాయత్రి' విద్యార్థినులు

పెద్దపల్లి:సెప్టెంబర్11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు.కళాశాలకు చెందిన పెగడ అంజలి,కాసర్ల శ్రీజ ఐసీఐసీఐ బ్యాంకులో ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.వీరు వార్షిక రూ.3.12 లక్షల నుండి రూ.3.80 లక్షల వరకు వేతన ప్యాకేజీ సాధించినట్లు నిర్వహకులు తెలిపారు.ఈ ముఖాముఖి కార్యక్రమంలో నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ గంగ ప్రసాద్,టాస్క్ రీజనల్ మేనేజర్ కౌసల్య, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కందునూరి సతీష్ మరియు వారి బృందం పాల్గొని విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థులు కళాశాలకు మాత్రమే కాకుండా పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తెచ్చారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జే.రవీందర్,టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే.కుమార్,అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.




# చిన్నారి పై "పాఠశాల కరెస్పాండెంట్" అత్యాచారం

**- పోలీసుల అదుపులో నిందుతుడు**
**- పాఠశాల పై చిన్నారి కుటుంబ సభ్యులు, బంధువుల దాడి**



వెల్గటూర్, సెప్టెంబర్ 11,ప్రజాకలం, ప్రతినిధి :

జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలంలోని ఓ గ్రామం లో నాలుగేళ్ల చిన్నారి పై ఓ ప్రయివేట్ పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాస్ అత్యాచారం చేశారన్న వార్త ధర్మపురి మండలంలో సంచలనం రేపుతుంది. విద్యా బుద్దులు నేర్పాల్సిన గురువే చిన్నారి పై అత్యాచారానికి పాల్పడితే ఎవరిని నమ్మలో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తు చిన్నారి కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాలలోని ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పాఠశాల కరెస్పాండెంట్ ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. చిన్నారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంధర్మపురి మండలంలోని ఓ గ్రామంలో ఓ ప్రయివేట్ పాఠశాలకు వచ్చిన నాలుగు సంవత్సరాల చిన్నారి పై ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ మూడు రోజుల క్రితం అత్యాచారానికి పాల్పడ్డట్లు తెలిపారు. కాగా సాయంత్రం ఇంటికి చేరిన చిన్నారికి రక్త స్రావం జరుగుతుండటంతో చిన్నారి తల్లి గమనించి, ఏం జరిగిందో చిన్నారిని అడిగి తెలుసుకుంది. చిన్నారి పై అత్యాచారం జగినట్లు గుర్తించిన ఆమె తల్లి, బంధువులతో కలిసివెళ్లి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విద్యాశాఖ అధికారులు సంబంధిత స్కూల్ పై విచారణ చేపట్టి పాఠశాల పర్మిషన్ రద్దు చేస్తున్నామని తెలిపినట్లు తెలిసింది . ఇక్కడ చదువుతున్న విద్యార్థులు సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యాభ్యాసం చేయాలని సూచించినట్లు సమాచారం.

## అండర్ 14 లో గేమ్స్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు




గొల్లపల్లి సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం చిల్వకోడూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని మండల స్థాయిలో ప్రతిభ కనబరిచారు. అండర్ 14 గేమ్స్ లో విద్యార్థులు షార్ట్ పుట్ లో నిస్సి మొదటి స్థానం, హై జంప్ లో రెండవ స్థానంలో షహీన్ అర్మాణ, 100 మీటర్ల పరుగులో అశమెరా , 600 మీటర్లు పరుగులో మొదటి స్థానంలో వర్ష , 400 మీటర్లు పరుగులో అశమెరా మొదటి స్థానంలో, 200 మీటర్ల పరుగులో రెండవ స్థానంలో ఏం రిశ్వంత్, 200 మీటర్ల పరుగులో వి. మమత , 100 మీటర్ల పరుగులో ఓ విశ్వంత్ రెండవ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి సెలెక్ట్ అయ్యారు. జిల్లా స్థాయికి సెలెక్ట్ అయిన విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి రవి , పి ఈ టి రజిత ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : సి ఐ.రాంనర్సింహారెడ్డి

గొల్లపల్లి సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గణేష్ మండప నిర్వాహకులకు ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ .కృష్ణసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గణేశ్ మండపాల వద్ద విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలనీ, అగ్నిప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ,దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వాడాలని, అధిక శబ్దంతో కూడిన డీజేలు, లౌడ్‌స్పీకర్లు వినియోగించకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలి. అసభ్యకరమైన పాటలు పెట్టి, నృత్యాలు చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. నిమజ్జనం కోసం వెళ్లే సమయంలో వాహనాలపై పరిమితికి మించి వ్యక్తులు ఎక్కకూడదు. వాహనాలను నడిపే వారు మద్యం సేవించి నడపరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు , నీటి వనరుల వద్ద ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకూడదనిఈత రాని వారు నీటిలోకి దిగరాదనీ. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.నిమజ్జనం సమయంలో విద్యుత్ తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన వాహనాలపై విగ్రహాలను సురక్షితంగా ఉంచి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.గణేశ్ నవరాత్రి ఉత్సవాలను , ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమనికి గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ యూ ఐ విద్యార్థి నేతకు సన్మానం

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం)

ఎన్ ఎస్ యూ ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోట దుర్గరాజ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జువ్వాడి భవన్ లో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు మర్యాదపూర్వకంగా సన్మానించారు.అనంతరం జువ్వాడి నర్సింగారావు మాట్లాడుతూ యువ నాయకుడుగా మరింత పార్టీని బలోపేతం చేయాలని మరింత ఉన్నత స్థానంలో ఉండాలని అభినందించారు ఈ కార్యక్రమంలో కర్ణాకర్ రావు,వెంకట్ రెడ్డి,శ్రీనివాస్ రావు,ప్రవీణ్ కుమార్,పుప్పాల నగేశ్,గంగారెడ్డి,జగన్,సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు



# అర్హత లేని వైద్య సేవలు

**- సూర్య ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు..**




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాకలం) పట్టణంలోని సూర్య ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు జిల్లా ఉప వైద్య అధికారి ముస్కు జైపాల్ రెడ్డి తెలిపారు. అర్హత లేని వైద్యుడితో ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నెల 2న ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా వైద్యుల విద్యార్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, ఆసుపత్రి రికార్డులను అధికారులు పరిశీలించారు. గుర్తించిన అంశాలపై ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అయితే యాజమాన్యం సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో గురువారం రాత్రి ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు డాక్టర్. జైపాల్ రెడ్డి వెల్లడించారు. విచారణలో అర్హత లేని వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలిందని, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో నమోదిత, అర్హత కలిగిన వైద్యులతోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై ఇకపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రామాల్లో ఉపాధి పనుల పండుగ

**- ఈ నెల 15 నుండి 25 వరకు ప్రత్యేక గ్రామసభలు**

**- ఎంపీడీవో సాదినేని ప్రియాంక**

పెద్దపల్లి:సెప్టెంబర్ 11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ



ఉపాధి హామీ పథకం కింద పేర్లు నమోదు చేసుకుని జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ కుటుంబానికి 125 రోజుల పని కల్పించడవే లక్ష్యంగా కమాన్‌పూర్ మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15 నుండి 25 వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాదినేని ప్రియాంక,ఏపీవో లావణ్య తెలిపారు. 2027-28 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల ప్రణాళికల రూపకల్పన కోసం ప్రత్యేక బృందాలు ఆయా గ్రామాల్లో పర్యటిస్తాయని పేర్కొంటూ, షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఈ ప్రణాళిక ప్రకారం సెప్టెంబర్ 15, 16 తేదీల్లో కమాన్‌పూర్,17 నుండి 20 వరకు గుండారం,గొల్లపల్లి,పెంచికలపేట్,పీరాపల్లి,21 నుండి 22 వరకు జూలపల్లి, రొంపికుంట,23 నుండి 25 వరకు నాగారం గ్రామాల్లో ఈ సభలు జరగనున్నాయి. ఈ పర్యవేక్షణ ప్రక్రియ కోసం ఎంపీడీవో,టెక్నికల్ అసిస్టెంట్‌లతో మొదటి టీమ్,ఏపీవోతో రెండవ టీమ్,ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌తో మూడవ టీమ్ చొప్పున మొత్తం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.పంచాయతీరాజ్,ఆర్డబ్ల్యూఎస్,అటవీ,ఇరిగేషన్,మత్స్య,హార్టికల్చర్,వ్యవసాయ,పశు సంవర్ధక శాఖల అధికారులు హాజరయ్యే ఈ గ్రామసభల కోసం పంచాయతీ కార్యదర్శులు తగిన ఏర్పాట్లు చేయాలని,కూలీలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

# ఎంపీడీవో చెన్నయ్యకు ఘన వీడ్కోలు




గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా కలం): గట్టు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఐదేళ్ల పాటు సేవలందించిన ఎంపీడీవో చెన్నయ్య ప్రమోషన్‌పై వేరే జిల్లాకు బదిలీ కావడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాచర్ల గ్రామ సర్పంచ్ బి. వజ్రమ్మ తిమ్మప్ప, ఉపసర్పంచ్ పెద్దింటి సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి. వజ్రమ్మ తిమ్మప్ప మాట్లాడుతూ, ఎంపీడీవో చెన్నయ్య గట్టు మండల ప్రజలకు ఐదేళ్లపాటు అందించిన సేవలు అభినందనీయమని, ఆయన బదిలీ అయినా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీడీవో చెన్నయ్యను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంట్రాక్టర్ బి. లోకేష్, జి. వీరేష్, ఏసీ రాముడు, శివరాజ్, బి. ఎసు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరమ్మ కుటుంబానికి మార్నేని రవీందర్‌రావు పరామర్శ

**- మాజీ వైస్ ఎంపీపీ తుంపుల మోహన్ తల్లి మృతి..**

**- కుటుంబ సభ్యులకు ఓదార్పు**

సెప్టెంబర్ 11 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)అయినవోలు మండలం మాజీ వైస్ ఎంపీపీ తుంపుల మోహన్ తల్లి ఈశ్వరమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సత్తిరెడ్డి, చందర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, మధు, దేవేందర్, భూపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## దళితులను అవమాన పరిచిన

# బీఆర్ఎస్ పార్టీని రద్దు చెయ్యాలి

**- కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

**- ఎమ్మెల్సీ తాత మధు పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి**



ధర్మారం, సెప్టెంబర్ 11 : ( ప్రజా కలం ప్రతినిధి ) దళితుల పట్ల అవమాన కరంగా అంటరానితనం తో కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద పసుపు నీళ్లు చల్లి శుద్ధిచేసి దళితులను అవమానించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పై అట్టాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు రాష్ట్ర మాల సంఘ నాయకులు (ఎమ్మార్పీఎస్ నాయకులు) ధర్మారం మండల వాస్తవ్యులు బొల్లి స్వామి అన్నారు శుక్రవారం రోజున హైదరాబాదు లోని బషీర్ బాగ్ లోని ప్రెస్ క్లబ్ లో ఎమ్మార్పీఎస్ నాయకులు, రాష్ట్ర మాల సంఘం నాయకుల ఆధ్వర్యం లో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం బొల్లి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ ఆయన కుమారుడు కేటీఆర్ అల్లుడు హరీష్ రావు దళితులను అవమానపరిచేలా ఫామ్ హౌస్ వద్ద దళితులు వెళ్లి డప్పు కొట్టినందుకు ఆ ప్రాంతంలోని పసుపు నీటితో శుద్ధి చేసి దళితుల అవమాన పరిచారని మండిపడ్డారు అదేవిధంగా రాష్ట్ర అసెంబ్లీ లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదు ను అవమానించేలా మాట్లా డిన ఎమ్మెల్సీ తాత మధు పై అసెంబ్లీ ఆక్టివ్ ప్రకారం చర్యలు తీసుకుంటూ అదేవిధంగా దళితులను అవమానపరిచేలా మాట్లా డిన తాత మధు తో పాటు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల అధికారులకు కలవ నున్నట్లు బొల్లి స్వామి పేర్కొన్నారు. అన్ని కులాల ను గౌరవించవలసిన పార్టీ అన్ని కులాల ఓట్లతో గెలిచి ముఖ్యమంత్రి, మంత్రులు గా పదవులు అలంకరించిన వారే అంటరానితనాన్ని అంటగట్టి పసుపు నీటితో ఆ ప్రాంతాన్ని ( కెసిఆర్ ఫామ్ హౌస్ ప్రాంతాన్ని) పసుపు నీటితో శుద్ధి చేయడం అదేవిధంగా రాష్ట్ర సభాపతి స్థానాన్ని అవమానపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ పార్టీని వెంటనే రద్దు చేయాలని జాతీయ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు వినతి పత్రం అందీయా నున్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని వాడవని అవమానించి సమాజం నుండి వెలివేసే విధంగా మాట్లాడిన ఏ విధంగా చర్య తీసుకోవా లో ఆర్టికల్ చూపిస్తున్నదని వెంటనే వారి పైన అట్రాసిటీ కేసును నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని కోరారు మా దళితు లను అవమానించిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల ను మా దళిత వాడలో తిరగనివ్వమని అన్నారు ఈ కార్యక్రమం లో దేవుని సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గడియారం రత్నం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి మహంకాళి రామ చంద్రం,మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు జున్ను జయరాజ్, గొర్రె రాజయ్య,దాసరి ఎల్లయ్య,ఇంజపూరి కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణకు ఘనంగా స్వాగతం..



వెల్గటూర్, సెప్టెంబర్ 11, ప్రజాకలం, ప్రతినిధి :

వెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణకు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర రహదారి గుండా వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్తున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను స్థంభంపల్లి బస్టాండ్ వద్ద ఆపి గ్రామంలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ యాగండ్ల గంగరాజం ఆధ్వర్యంలో నాయకులు గ్రామానికి సంబంధించిన పలు అంశాలను పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో చర్చించారు. గ్రామంలో అవసమైన సిసి రోడ్లు, రాష్ట్ర రహదారి పక్కన గల త్రాగునీటి బావి వద్ద నుంచి గ్రామంలో గల వాటర్ ట్యాంక్ వరకు అవసరమైన పైపు లైన్ ను మంజూరు చేయించాలని కోరారు. గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల వద్ద నుంచి గ్రామ శివారులో కొండ పై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు సిసి రోడ్డు నిర్మాణం జరిగేలా ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కాగా వారి అభ్యర్థలకు పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ సానుకూలంగా స్పందించారు. గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం తొందరలోనే ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు తాను స్వయంగా వస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ గంగయ్య తో పాటుగా కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కాశ శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సప్ప లింగయ్య, నాయకులు చంబర్తి కొమరయ్య, లక్ష్మణ్, పాదం తిరుపతి, చింతల కొమురయ్య, శివకుమార్, జెల్ల సురేష్, లవంగం రాజయ్య తదితరులు పాల్గొన్నారు .

# నూతన సీఐకి వెంకట్రావు పల్లె కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

**- ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు అందించాలి**

**- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం : మడత ప్రశాంత్**

సెప్టెంబర్ 11 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణానికి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావును వెంకట్రావుపల్లె కాంగ్రెస్ పార్టీ నాయకులు,మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సంజీవరావుకు అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడత ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలపై సత్వరమే స్పందించేలా పోలీస్ వ్యవస్థ మరింత ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని అన్నారు.పోలీస్ స్టేషన్‌కు సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరి ఫిర్యాదును సానుకూలంగా స్వీకరించి, చట్టపరమైన పరిధిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు, ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని,వినియోగించుకుంటూ నేరాల నియంత్రణ, నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.ముఖ్యంగా యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మాదక పదార్థాలు, గుట్కా, పొగాకు



తదితర హానికర పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంలో పోలీసులతో పాటు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు కూడా భాగస్వాములు కావాలని అన్నారు. వర్ధన్నపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే పోలీస్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తే నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. నూతన సీఐ సంజీవరావు ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడత ప్రశాంత్ గౌడ్, సంకినేని దేవేందర్‌రావు, మిట్టపల్లి రమేష్, ఎండీ వలీ పాషా, బూడిద శ్రీనివాస్ గౌడ్, వంగపండ్ల బలరాములు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతి విగ్రహాల తరలింపు వాహనంపై మెట్ పల్లి కమిషనర్ వివరణ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ మట్టి గణపతి విగ్రహాల తరలింపునకు



ఉపయోగించిన వాహనంపై వచ్చిన అంశానికి సంబంధించి సంబంధిత ఉద్యోగి నుంచి వివరణ సేకరించడం జరిగిందని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. నర్సరీ నుంచి వివిధ వార్డులు, ప్రాంతాలకు మొక్కలను తరలించే వాహనాన్ని కలెక్టరేట్‌కు పంపించినట్లు సంబంధిత ఉద్యోగి వివరించారు. అయితే మున్సిపల్ వాహనాలు కొనుగోలు సమయంలోనే 'స్వచ్ఛ ఆటో', 'తడి చెత్త', 'పొడి చెత్త' అనే పోస్టర్లతో వస్తాయని తెలిపారు. ప్రస్తుతం మట్టి గణపతి విగ్రహాలను తరలించేందుకు ఉపయోగించిన వాహనం చెత్త సేకరించే వాహనం కాదని సంబంధిత జవాన్ కార్యాలయం కు స్పష్టం చేశారన్నారు. అయినప్పటికీ మట్టి గణపతి విగ్రహాలకు సంబంధించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ ఘటన వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే, మెట్టుపల్లి మున్సిపాలిటీ తరపున ఆయన క్షమాపణలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

వెల్గటూర్, సెప్టెంబర్ 11, ప్రజాకలం, ప్రతినిధి :

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం వెల్గటూర్ మండలంలోని పాసిగామ




గ్రామంలో గల యంపిపిఎస్ పాఠశాలను నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలకు విశాఖ ట్రస్ట్ ద్వారా 25 బేంచీలు మంజూరుకాగా వాటిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో గల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సేవలు మరువ లేనివని పేర్కొన్నారు. గత సంవత్సరం ఇక్కడి పాఠశాలను సందర్శించిన సమయంలో పాఠశాలలోని విద్యార్థుల అవసరాలను గుర్తించి విశాఖ ట్రస్ట్ ద్వార 25 బేంచీలను మంజూరు చేయించినట్టు తెలిపారు. అదనపు తరగతి గది నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వార రూ. 18 లక్షల నిధులను విడుదల చేయించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ , జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలెందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్,
ఏఎంసి చైర్మన్ గోల్ల తిరుపతి, కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్ , నాయకులు మేరుగు మురళి గౌడ్, గుండాటి సందీప్ రెడ్డి, కాంద్రపు మహేష్, అల్లం బుచ్చయ్య, జనార్ధన్, నరేశ్, లక్ష్మణ్, మల్లేశం, తిరుపతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రోగుల రద్దీ

**- వసతుల్లో కొంత ఇబ్బంది ఉన్నా వైద్యంలో లోటు ఉండదు**

**- పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్**

పెద్దపల్లి:సెప్టెంబర్11:(ప్రజాకాలం జిల్లా ) ప్రతినిధి) ప్రస్తుత ఎపిడెమిక్ సీజన్ కారణంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి ఒక్కసారిగా భారీగా




పెరిగింది. 100 పడకల సామర్థ్యం మాత్రమే ఉన్న ఈ ఆసుపత్రిలో ఏకంగా 288 మంది రోగులు అడ్మిట్ కావడంతో బెడ్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. దీంతో ఆసుపత్రి వర్గాలు వేగంగా స్పందించి, రోగులకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రి కారిడార్లలోనే తాత్కాలికంగా మంచాలు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నతట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మౌలిక సదుపాయాల పరంగా రోగులకు,వారి బంధువులకు కొంత అసౌకర్యం కలిగినప్పటికీ,వైద్య చికిత్సలో ఎలాంటి లోటు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. ఆసుపత్రి వైద్య సేవలపై ఏవైనా సందేహాలు లేదా సమాచారం కోసం సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ 849906199 ను సంప్రదించవచ్చని సూపరింటెండెంట్ శ్రీధర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# గుల్లకోట గ్రామ శివారు లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- ఆరుగురు వ్యక్తులు అరెస్ట్, రూ. 4,510 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం**




ఎండపల్లి, సెప్టెంబర్,11 ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని గుల్లకోట గ్రామ శివారు లో పేకాట ఆడుతున్న స్థావరం పై పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి పేకాటలో ఉపయోగిస్తున్న రూ. 4,510/- నగదు, ఆరు మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పులిచేర్ల ఉదయ్ కుమార్ తెలిపారు. ప్రజలు చట్ట విరుద్ధమైన పేకాట, జూదం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియ జేయాలని పోలీసులు సూచించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

## – అదనపు కలెక్టర్ శ్రీరాములు



పెద్దపల్లి,సెప్టెంబర్ 11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జన పాయింట్ల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ,పారిశుధ్యం,వైద్య సేవలు,భద్రత,నిమజ్జన మార్గాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు.

**నాలుగు పట్టణాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించాలి**

జిల్లాలోని నాలుగు పట్టణ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపాలిటీ స్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమజ్జనం ఎక్కడ జరుగుతుందో ముందుగానే పరిశీలించి,ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు.నిమజ్జనానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నిమజ్జన మార్గాల్లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.

**నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు**

నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేర బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా,తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లను, క్రేన్ల మరమ్మతులు చేసేందుకు మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం రోజున ఉదయం నుంచే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**విద్యుత్,కేబుల్ సమస్యలు ముందుగానే పరిష్కరించాలి**

గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్‌కు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. విగ్రహాల తరలింపు మార్గాల్లో అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని, ఇంటర్నెట్, టీవీ కేబుళ్లను సరిచేయాలని అన్నారు. జిల్లాలో ఎత్తైన గణేష్ విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

**గజ ఈతగాళ్లు,వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి**

ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద అవసరమైన మేర గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే సమన్వయం చేసుకుని వారికి షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రొటోకాల్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.నిమజ్జన ప్రాంతాలు, చెరువుల వద్ద ప్రభుత్వ,ప్రైవేట్ అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

**మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బంది నియమించాలి**

నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిమజ్జనం పూర్తయ్యే వరకు పరిశుభ్రతను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ అన్నారు.నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు.

**మద్యం విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా**

నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలకు అవకాశం లేకుండా మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.నిమజ్జన మార్గాల్లో మద్యం దుకాణాలు,ఇతర దుకాణాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు**

గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో రోడ్లపై సంచరించే పశువుల వల్ల ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.గతంలో రాత్రివేళ విగ్రహాల తరలింపు సమయంలో ఆవులు,ఎద్దులు రోడ్లపైకి రావడం వల్ల దీపాలు లేదా విగ్రహాలు పడిపోయిన ఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయాన్ని ప్రస్తావించారు.ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్లపై పశువులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**స్వీయ నియంత్రణతో ప్రశాంతంగా నిమజ్జనం**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పోలీసు, ఇతర శాఖల అధికారులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్,ఏసీపీ జి.కృష్ణ,కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

## – విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి: మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

సెప్టెంబర్ 11 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట)

వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కళాశాల యాజమాన్యంతో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. కళాశాల పరిసరాలను పరిశీలించిన ఆయన విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సుమారు 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంపై హర్షం

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం పోషకాహారంతో కూడిన భోజనం అందించడం వల్ల తమకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ఈ సదుపాయాలతో ఆరోగ్యంగా ఉంటూ చదువుపై మరింత ఏకాగ్రత సాధించే అవకాశం కలుగుతోందన్నారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, విద్యార్థుల అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని వసతులు

కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చైర్మన్ సారంగపాణి తెలిపారు. గత వారం ఎమ్మెల్యే కళాశాలను సందర్శించి విద్యార్థుల అవసరాలను తెలుసుకుని టేబుల్స్, చైర్స్ అందజేశారని పేర్కొన్నారు.



కళాశాలకు అవసరమైన బోర్డులు, డస్ట్‌బిన్లు, ఇతర సామగ్రిని కూడా అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, మరో రెండు రోజుల్లో అవసరమైన వస్తువులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు కళాశాలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే సహకారంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్తో పాటు ఇతర అధ్యాపకులు, సిబ్బంది, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోసం రోడ్డెక్కిన రైతన్నలు

## పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన – 24 గంటల విద్యుత్ సరఫరా కోసం డిమాండ్



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11, ప్రజా కలం

విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మల్దకల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని ఐజ–గద్వాల ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. వ్యవసాయానికి కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

రైతుల ధర్నాతో ఐజ––గద్వాల ప్రధాన రహదారిపై సుమారు అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సమాచారం అందుకున్న మల్దకల్ ఎస్సై కొండ శ్రీహరి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం రైతుల సమస్యలను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యుత్ శాఖ ఏఈ రాజేష్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా ఏఈ రాజేష్ మాట్లాడుతూ రైతుల విద్యుత్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు.పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, దామ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు పటేల్ జనార్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వీరేశ్ గౌడు, రైతులు గజ్జలన్న, తిమ్మప్ప, మంగళ కృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# హనుమకొండలో రైస్ మిల్లర్ల మహా ధర్నా

## వెంటనే డిమాండ్లు పరిష్కరించాలి – రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



హనుమకొండ సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లా డిస్టిక్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతు మిల్లర్లు హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్,టాస్క్ ఫోర్స్ అకస్మిక దాడులను వెంటనే నిలిపివేసి రెండు నెలల నుండి అన్యాయంగా రన్నింగ్ మిల్లర్ల పైన వేసిన కేసులను బెషరతుగా ఉపసంహరించుకొని మిల్లర్లతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని అన్నారు. సీమ అగ్రిమెంట్ నిరూపక్షాలకు ఆమోదయోగంగా ఉండేలా రూపొందించి గతంలో ప్రభుత్వం చేసిన ఓటీఆర్ టెస్టు మిల్లింగ్ ప్రకారం కర్ణాటక సైంటిస్టుల రిపోర్టు ప్రకారంగా మాత్రమే బియ్యం తీసుకోవాలి అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బియ్యం రికవరీ శాతాన్ని నిర్ణయించాలని, క్వింటాల్ ధాన్యానికి మిల్లింగ్ ఛార్జీలను రా బియ్యానికి రూ.150, బాయిల్డ్ బియ్యానికి రూ.200కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. పాత గన్నీ బ్యాగ్ ధరను రూ.9గా నిర్ణయించడంతో పాటు పాత సంచులపై 20 శాతం తరుగుదలను తగ్గించాలని కోరారు. 2014 నుంచి రావాల్సిన సివిల్ సప్లైస్ మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్, డ్రైయేజ్, కస్టోడియన్ ఛార్జీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని రద్దు చేయాలని కోరారు. 2022–23 రబీ టెండర్ ధాన్యం ధరను న్యాయంగా నిర్ణయించి, అప్పటి గోదాము, హమాలీ, హ్యాండ్లింగ్ ఛార్జీలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయి డిఫాల్ట్ అయిన మిల్లర్ల లెక్కలను పూర్తిగా తేల్చి, బకాయిలను నాలుగు విడతలుగా అప్పటి ధాన్యం ఎంఎస్పి రేటు ప్రకారం చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. ఖరీఫ్ ధాన్యాన్ని సివిల్ సప్లైస్ ద్వారా రా రైస్‌గా, రబీ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా స్వీకరించాలని డిమాండ్ చేశారు.ఎఫ్ సి ఐ కఠిన నిబంధనలను కొంతమేర సడలించి, లెవీ బియ్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడా ఎఫ్ సి ఐ గోదాముల్లో స్థలం కల్పించాలని కోరారు.

ప్రస్తుతం మిల్లర్ల వద్ద ఉన్న మొత్తం సీఎంఆర్ ధాన్యాన్ని త్వరగా తీసుకుని, అనంతరం 2026–27 ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించాలని రైస్ మిల్లర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా

## నాణ్యమైన విద్యుత్ అందించాలి: డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా కలం): గద్వాల నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధరూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట మండల రైతులు శుక్రవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డితో పాటు బీజేపీ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలోని రైతులు తీవ్ర విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ బోర్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు సకాలంలో నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చకపోవడం వల్ల రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లోపాల కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని, వాటి మరమ్మతులు, కొత్త మోటార్ల కొనుగోలుతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ అందక రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన మేరకు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, తక్కువ వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు



పంటల రక్షణ కల్పించాలని కోరారు. ధర్నా నేపథ్యంలో ఎస్ఈ అబ్దుల్ కరీం, డీఈ రవి ప్రసాద్ ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో డీకే స్నిగ్ధారెడ్డి హామీ మేరకు రైతులు ధర్నాను విరమించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, అక్కల రమాదేవి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ధరూర్ కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీపాదరెడ్డి, శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నాయకులు సంజీవ్ భరద్వాజ్, నర్సన్ దొడ్డి కృష్ణారెడ్డి, మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, రజక నరసింహులు, చింతరేవుల రాజేష్, హన్మంతరాయ, శేఖర్‌రెడ్డి, డీఆర్ లక్ష్మన్న, రామిరెడ్డి, అనిల్, దామ నాగరాజు, సంజీవరెడ్డి, యువరాజ్, సద్దల కృష్ణ, కౌన్సిలర్ శాలన్న తదితరులు పాల్గొన్నారు.

# 4వ బెటాలియన్ లో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు



హనుమకొండ సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి

4వ బెటాలియన్ ప్రాంగణంలో సిబ్బంది మరియు అధికారులకు నూతన క్రిమినల్ చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ ఎన్.వి.సత్య శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యనారాయణ(సిఐ),రాధిక (ఎస్ఐ) క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిపించారు. దేశవ్యాప్తంగా 01 జూలై 2024 నుండి అమల్లోకి వచ్చిన మూడు కొత్త చట్టాలపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు.పాత ఐపిసి స్థానంలో వచ్చిన భారతీయ న్యాయ సంహిత,2023 (బిఎన్ఎస్) లోని నేరాలు–శిక్షల అంశాలను వివరించారు.పాత సిఆర్‌పిసి (జతీూజ) స్థానంలో వచ్చిన భారతీయ నాగరిక సురక్షా సంహిత,2023 (బిఎన్ఎస్ఎస్ ) లోని క్రిమినల్ ప్రొసీజర్‌పై అవగాహన కల్పించారు.పాత ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అధినియమం,2023 (బిఎస్ఎ) లోని సాక్ష్యాధారాల నిబంధనలను తెలియజేశారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ సిబ్బంది ఈ కొత్త చట్టాలపై పూర్తి పట్టు సాధించాలని కమాండెంట్ పిలుపునిచ్చారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక మరియు సాంకేతికతకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను తీసుకురావడమే ఈ చట్టాల లక్ష్యం. ఈ నూతన చట్టాల ప్రధాన పరమార్థం కేవలం శిక్షించడం కాకుండా,బాధితుడి కేంద్రంగా త్వరితగతిన న్యాయం అందించడం. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజేందర్,ఆర్.ఐలు కార్తీక్, రవి, సర్వర్,రాజ్ కుమార్,కృష్ణ ఆర్.ఎస్.ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పొలాల్లోకి దిగిన వరంగల్ కలెక్టర్.. రీ–సర్వేపై సీరియస్.!

## – జమాల్‌పురంలో వ్యవసాయ భూములపై జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పరిశీలన

(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 11, ప్రజాకలం ప్రతినిధి

భూముల రీ–సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం పర్వతగిరి మండలం జమాల్‌పురం గ్రామంలోని వ్యవసాయ భూముల్లోకి స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న రీ–సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయి.. భూముల హద్దులు, కొలతలు, రికార్డుల వివరాలు ఎలా నమోదు చేస్తున్నారు అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. భూముల రీ–సర్వేలో చిన్నపాటి తప్పిదాలకు కూడా అవకాశం ఇవ్వకుండా, నిబంధనల ప్రకారం అత్యంత జాగ్రత్తగా, పూర్తి పారదర్శకతతో సర్వే ప్రక్రియను నిర్వహించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం మాత్రమే వివరాలను నమోదు చేయాలని, భూయజమానులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ–సర్వే పూర్తయిన తర్వాత భూ హద్దులు, రికార్డులకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ స్వయంగా వ్యవసాయ భూముల్లోకి వెళ్లి రీ–సర్వే పనులను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా యంత్రాంగం రీ–సర్వే ప్రక్రియను ఎంత సీరియస్‌గా తీసుకుంటుందో ఈ పర్యటన స్పష్టం చేస్తోందని స్థానికులు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుమ, డిఆర్డిఓపిడి నాగ పద్మజ, సర్వే ఏడి శ్రీనివాసు, స్థానిక తహశీల్దార్ వెంకటస్వామి, జమల్ పురం గ్రామ సర్పంచ్, సోమారం గ్రామ సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

**– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్**



పెద్దపల్లి,సెప్టెంబర్ 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ మహమ్మారికి మరియు సైబర్ నేరాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును బంగారు బాటగా మలచుకోవాలి అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు,సైబర్ క్రైమ్ వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు విపులంగా వివరించారు.తమ కాలనీల్లో ఎక్కడైనా మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్,గ్రామ పంచాయతీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.ఒకవేళ సైబర్ నేరాల బారిన పడితే నేరం జరిగిన మొదటి గంట లోపల 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అందిస్తే నష్టాన్ని అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అతుల్య, డబ్ల్యూపీసీ నాగరాణి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశ్వంత్, ఉపాధ్యాయులు,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నుచ్చు శ్రీనివాస్,న్యాయవాది తాని నరేష్,విద్యార్థినిలు పాల్గొన్నారు.

# దళితులపై దాడులను అరికట్టాలి

**– కలెక్టరేట్ ఎదుట దళిత సంఘాల ఐక్యవేదిక ధర్నా**

పెద్దపల్లి:సెప్టెంబర్ 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలో ప్లాట్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషించి,చంపుతామని చెలుకల శ్రీనివాస్,ఐలయ్య,మనోజ్ బెదిరించారని, దీనిపై




పోలీసులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు కుక్క కనకరాజు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఐక్యవేదిక నాయకులు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదుపై తక్షణమే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించిన ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్,కుక్క అశోక్,బొంకూరి నరేందర్,మామిడిపల్లి బాపయ్య,నంబయ్య,సతీష్,రామిళ్ల శారద,కల్లపెల్లి అశోక్,మోదుంపెల్లి శ్రావణ్,నూనె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కష్టాలు తీరేది ఎప్పుడు?

**– కరెంట్ కష్టాలు తీర్చండి బాబు అంటూ ఏడిఈ కాళ్ళు మొక్కిన రైతులు.**

మరిపెడ ప్రతినిధి ప్రజాకాలం న్యూస్ సెప్టెంబర్ 11



రాత్రుళ్లు గ్రామంలో తరచూ కరెంటు వస్తూ పోతుందని, 24 గంటలు కరెంటు సరఫరా జరగటంలేదని, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, కోతలు ఉండటంతో పంటలు ఎండుతున్నాయంటూ సబ్ స్టేషన్ ఎదుట భారీ ధర్నా నిర్వహించిన ఘటన మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో చోటుచేసుకుంది. రైతులు కొన్ని గంటలకు భారీ ఎత్తున నిర్వహించారు ఎంతసేపటికి ధర్నా విరమించకపోవటంతో సమాచారం అందుకున్న స్థానిక ఏడీఈ శ్రీనివాస్ సబ్ స్టేషన్ కు చేరుకోగా ఒక్కసారిగా ఆ..అధికారి కాళ్లపై రైతులు పడి విద్యుత్ ఇవ్వాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన ఏడీఈ సమస్యను మౌఖికంగా తెలుసుకుని అంతరాయం లేకుండా చూస్తామనటంతో ధర్నా విరమింపజేశారు. అనంతరం ఏడీఈ మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్ని ఫీడర్లపై ఉన్న మోటార్లు ఒక్కసారే ఆన్ చేస్తుండటంతో ఫీడర్లపై అధిక భారం పడి ట్రిప్ అవుతున్నాయన్నారు. విద్యుత్ నిరంతరం అందించటానికి విద్యుత్ శాఖ తరపున అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

# ఉన్మత్త భైరవ దేవాలయంలో మహా పాలాభిషేకం

హనుమకొండ సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి : హనుమకొండ పద్మాక్షి



రోడ్ మారుతి హిల్స్ లో గల శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయంలో శుక్రవారం శ్రావణమాసం ముగింపు పొలాల అమావాస్య సందర్భంగా దేవాలయంలో భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా మహా పాలాభిషేకం నిర్వహించారు. 108 లీటర్ల ఆవుపాలతో పాలాభిషేకం అమ్మవారికి స్వామివారికి భక్తులు సమర్పించారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు వీరభద్రనాథ్ మాట్లాడుతూ.. ఈ అమావాస్య ఎంతో శక్తివంతమైనదని, వందేళ్లకు ఒకసారి వచ్చే ఈ అమావాస్య రోజు భక్తి శ్రద్ధలతోటి భక్తులు పాల్గొని కూష్మాండ దీపం, మిరియాల దీపం,నారికేల దీపాలు పెట్టి వారి భక్తిని చాటుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మవారికి,స్వామివారికి అంతంత వైభవంగా అలంకరణ,మహా హారతి, అన్నదాన ప్రసాదం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# పార్కు స్థలాన్ని పరిరక్షించండి

**– రెవెన్యూ తీరుపై రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసుల నిరసన**

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి**



పెద్దపల్లి:సెప్టెంబర్11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణ మున్సిపల్ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ పరిధిలో చిల్డ్రన్స్ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని మాజీ నక్సలైట్లకు కేటాయించడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్.కాలనీ నివాసులు,వెల్ఫేర్ సొసైటీ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముందట తీవ్ర ఆందోళన చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష,కార్యదర్శులు సిరిశెట్టి శ్రీనివాస్,మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని 288 కుటుంబాల పిల్లల ఆటపాటల కోసం,ప్రజా అవసరాల కోసం గతంలో కొంత స్థలాన్ని పార్కు నిమిత్తం కేటాయించారని తెలిపారు.మున్సిపల్ ఆధ్వర్యంలో స్థలాన్ని చదును చేసి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు వచ్చి పార్కు స్థలంలో కొలతలు వేసి,మాజీ నక్సలైట్లకు కేటాయిస్తున్నామని చెప్పడం సరికాదన్నారు.కాలనీవాసులకు శుభకార్యాలు,సమావేశాలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ ఒక్క ఖాళీ స్థలం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పార్కు స్థలాన్ని వేరే వారికి కేటాయించడం తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని,మాజీ నక్సలైట్లకు వేరే చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని డిమాండ్ చేశారు.కాలనీవాసులకు కేటాయించిన పార్కు స్థలాన్ని కాలనీ అవసరాలకే పరిరక్షిస్తూ తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గంధం రవి,జీడి కిరణ్, కోశాధికారి నల్ల సతీష్,ప్రచార కార్యదర్శి యం.డి.సాబీర్ పాషా,సంయుక్త కార్యదర్శులు,సలహా సంఘం సభ్యులు,పెద్ద సంఖ్యలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు

**– సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక స్క్రీనింగ్**

**– 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐ స్క్రీనింగ్.. అద్దాలు, అవసరమైతే ఉన్నత వైద్యసేవలు**



సెప్టెంబర్ 11 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు, సిబ్బంది, ఆప్తాల్మిక్ అధికారులు, డైస్ ఆప్టోమెట్రిస్టులతో సంసిద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రాజా రెడ్డి మాట్లాడుతూ వారానికి మూడు లేదా నాలుగు రోజుల పాటు ప్రత్యేక కంటి పరీక్షల శిబిరాలు నిర్వహిస్తామన్నారు.వరంగల్ జిల్లాలో ఐదు ఆర్‌బీఎస్‌కే బృందాలు ఒక్కో బృందానికి ఆప్టోమెట్రిస్ట్ లేదా ఆప్తాల్మిక్ అధికారిని అనుసంధానం చేసి విద్యార్థులకు ఐ స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఒక్కో బృందం రోజుకు సుమారు 300 మంది విద్యార్థులను పరీక్షించాలని సూచించారు. కంటి చూపులో వక్రీభవన లోపాలు (రిఫ్రాక్టివ్ ఎర్రర్స్) ఉన్న విద్యార్థులను గుర్తించి కంటి అద్దాలకు సిఫారసు చేస్తామని, ఇతర కంటి సమస్యలు గుర్తించిన వారికి అవసరమైన ఉన్నత వైద్యసేవల కోసం ఆసుపత్రులకు రిఫర్ చేస్తామని చెప్పారు.ప్రతిరోజు నిర్వహించిన పరీక్షల వివరాలతో రోజువారీ నివేదికను జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు పంపాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక వైద్యాధికారులు, ఇతర సిబ్బందితో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం అధికారి (సీహెచ్ఐ) డా. ప్రకాష్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది, ఆప్తాల్మిక్ అధికారులు, డైస్ ఆప్టోమెట్రిస్టులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సమాచారమిస్తే రూ.10 వేల బహుమతి!

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ – డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. గంజాయి సాగుపై నిఘా**



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11, ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లాలో డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. డ్రగ్స్ కార్యకలాపాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించే పౌరులకు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్ అభియాన్ సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యాసంస్థలు, ముఖ్యంగా కళాశాలల్లో విద్యార్థులు, యువతకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘా పెంచాలని సూచించారు. గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, యువతలో కొందరు స్టెరాయిడ్లు వినియోగిస్తున్న నేపథ్యంలో జిమ్ నిర్వాహకులు, శిక్షకులు, ఆర్ఎంపీలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు, గుట్కా విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు.

ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి, ఈగల్ విభాగంతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



అయినవోలు, సెప్టెంబర్ 11:– (ప్రజా కలం ప్రతినిధి)

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ అయినవోలు మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షులు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజు అని, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన ఈ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, భావితరాలకు చరిత్రను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మడ్డీ రవితేజ, అనుముల ఆగారెడ్డి, సీనియర్ నాయకులు బొల్లెపల్లి మహేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు నాతి సతీష్, గూబ దేవేందర్, దోనికల వెంకటేష్, గుండబోయిన నరసింహ, దూసరి రాజేష్, ఆడెపు విక్రమ్, రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్, కోట నరసయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల జోలికొస్తే ఊరుకునేది లేదు

**బి. కురుమన్న, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు**



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా కలం): దళితుల ఇళ్లను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి. కురుమన్న డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.గద్వాల మండల పరిధిలోని రేపల్లి గ్రామంలో మాదిగ కులానికి చెందిన రంగముని, బీసీ కులానికి చెందిన మహేశ్వరి ప్రేమించి వివాహం చేసుకున్నారనే కారణంతో మహేశ్వరి కుటుంబ సభ్యులు దళితుడైన రంగముని ఇంటిపై దాడి చేసి, సుమారు 30–40 మంది ప్రొక్లెయిన్ (జేసీబీ), గడ్డపారలతో ఇంటిని ధ్వంసం చేయడం దుర్మార్గమని కురుమన్న అన్నారు. ఇద్దరు యువతీ యువకులు తమ ఇష్టప్రకారం కులాంతర వివాహం చేసుకుంటే కుల వివక్ష పేరుతో దాడులకు పాల్పడటం సమర్థనీయం కాదన్నారు. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ పోలీసులు తగిన చర్యలు తీసుకుని ఉంటే దళితుల ఇళ్లు ధ్వంసం అయ్యేవి కాదని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు తక్షణమే స్పందించి ఘటనకు బాధ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రేమజంటతో పాటు వారి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని, రేపల్లి గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

# మండల స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ




గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా కలం):మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ హాజరై విద్యార్థులను పరిచయం చేసుకుని క్రీడా పోటీలను ప్రారంభించారు.వాలీబాల్‌లో 15 మంది, ఖో–ఖోలో 16 మంది, కబడ్డీలో 15 మంది బాలబాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి. సురేష్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, జీహెచ్ఎం నరేష్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కె.ఎ. సుహాసిని, ఫిజికల్ డైరెక్టర్లు రత్నమాల, ఆనంద్, రాజేశ్వరి, భారతి, విజయలక్ష్మి, శరణ్య పాల్గొన్నారు.

# ముంజాల రాజకుమార్ గౌడ్‌కు వరంగల్ జిల్లా బిజేవైయం సెక్రటరీగా బాధ్యతలు

(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 11, ప్రజాకలం ప్రతినిధి.



భారతీయ జనతా యువ మోర్చా బిజేవైయం వరంగల్ జిల్లా సెక్రటరీగా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన ముంజాల రాజకుమార్ గౌడ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బిజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుందే గణేష్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, జిల్లా బిజేవైయం అధ్యక్షులు భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్, జిల్లా ఉపాధ్యక్షులు కూడికల శ్రీధర్, పర్వతగిరి మండల అధ్యక్షులు హార్కవత్ వినోద్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాజకుమార్ గౌడ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు, బిజేవైయం కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, యువతను భాగస్వాములను చేస్తూ అహర్నిశలు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాజకుమార్ గౌడ్ నియామకం పట్ల మండల బీజేపీ, బిజేవైయం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పాఠశాల విద్యార్థులకు మొక్కల పంపిణీ

(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 11, ప్రజాకలం ప్రతినిధి.మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో మా కే నామ్ ఏక్ పేడ్ .. కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ వీల్ క్లబ్ వరంగల్ వారి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ప్రతి విద్యార్థికి ఒక మొక్క చొప్పున పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ మర్రి రేణుక మాట్లాడుతూ, మొక్కలను నాటి చెట్లను పెంచే బాధ్యతను విద్యార్థి దశ నుంచి అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ మాట్లాడుతూ, భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులను, కరువు కాటకాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరు చెట్లను పెంచాల్సిన బాధ్యత ఉందని దాదాపు 250 పైగా పండ్ల మొక్కలను శుక్రవారం పంపిణీ చేసిన ఇన్నర్ వీర్ క్లబ్ వరంగల్ గారికి పాఠశాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు నాడు ఒక మొక్క నాటాలని విద్యార్థులని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ సిహెచ్ రవళి, గ్రీన్ ట్రీ సిటీ ప్లానిటేషన్ బాధ్యులు కడారి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన కక్కిరాలపెల్లి

# సర్పంచ్ బర్ల వాణి రవికుమార్

- కండువా కప్పి ఆహ్వానించిన టి.పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజా పాలన, అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక
- మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ దంపతులు
- ప్రజాకలం ముందే చెప్పింది.. ఇప్పుడు నిజమైంది! – అధికార పార్టీ వైపు ఆ పల్లె సర్పంచ్ చూపు?
- అప్పుడు రాజకీయ మార్పుపై కథనం.. ఇప్పుడు కాంగ్రెస్‌లో సర్పంచ్ దంపతుల చేరిక





RNI NO.TELTEL/2010/33275
ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
02 Aug 2026 - Page 5

మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అధికార పార్టీ వైపు ఆ (పల్లి)సర్పంచ్ చూపు?**

-సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలో నిలిచి గెలిచిన సదర్ సర్పంచ్
-అధికార వ్యామోహమా..? లేక అభివృద్ధి పేరుతో రాజకీయ మార్పా..?

ఆగస్టు 1 అయినవోలు:-( ప్రజా కలం ప్రత్యేకం )

ఆ గ్రామ ప్రజలు నమ్మి, టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీ జెండా కింద గెలిపించిన సర్పంచ్ నేడు అధికార పార్టీ వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారంతోనే అభివృద్ధి సాధ్యమనే వాదన వినిపిస్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, పార్టీ పట్ల చూపిన నిబద్ధతను గుర్తు చేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఒక పార్టీ సిద్ధాంతాలను నమ్మి ప్రజల మద్దతుతో గెలిచిన ప్రజాప్రతినిధి, కొద్దికాలానికే అధికార పార్టీకి దగ్గరవుతుండటం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనంగా కనిపిస్తోందని గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. "అభివృద్ధి కోసం" అనే కారణం చెప్పడం సులభమే. కానీ నిజంగా అభివృద్ధి కోసం అయితే ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కూడా ప్రజాప్రతినిధిపైనే ఉంటుంది. అధికార పార్టీ నాయకులతో తరచూ సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రత్యేకంగా పాల్గొనడం, పార్టీ మార్పుపై వస్తున్న సంకేతాలు ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తున్నాయి. గ్రామ అభివృద్ధి ఏ ప్రజాప్రతినిధి లక్ష్యమే కావాలి. అయితే అభివృద్ధి పేరుతో రాజకీయ నిబద్ధతను పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక పార్టీకి అనుకూలంగా ఉండగా, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం ఆ తీర్పును పక్కన పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ప్రచారాలపై సంబంధిత సర్పంచ్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. కాబట్టి ఇవి స్థానికంగా వినిపిస్తున్న రాజకీయ ఊహాగానాలు మాత్రమే. వాస్తవ పరిస్థితిపై ఆయనే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ఐనవోలు, సెప్టెంబర్ 11:-
(ప్రజా కలం ప్రతినిధి)

కక్కిరాలపల్లి రాజకీయాల్లో ప్రజాకలం పత్రిక గతంలో ప్రచురించిన కథనం అక్షరాలా నిజమైంది. గ్రామ సర్పంచ్ బర్ల వాణి రవికుమార్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అప్పట్లో ప్రజాకలం లేవనెత్తిన రాజకీయ ప్రశ్నలకు తాజాగా సమాధానం లభించినట్లయింది. గతంలో "అధికార పార్టీ వైపు ఆ పల్లె సర్పంచ్ చూపు?" అంటూ ప్రజాకలం ప్రచురించిన కథనంలో.. సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలో నిలిచిన నాయకత్వం, అధికార పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు, రాజకీయ మార్పుపై పలు అంశాలను ప్రస్తావించింది. తాజాగా శుక్రవారం బర్ల వాణి రవికుమార్ దంపతులు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ నాటి విశ్లేషణకు బలం చేకూరినట్లయింది.

**కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన టిపిసిసి చీఫ్**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా బర్ల వాణి రవికుమార్ దంపతులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు.

**అభివృద్ధి వైపే తమ అడుగులు**

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారని సర్పంచ్ దంపతులు పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి తమను ఆకట్టుకుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు అండగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

**మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీ**

కాంగ్రెస్‌లో చేరిన అనంతరం బర్ల వాణి రవికుమార్ దంపతులు మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతనంగా కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ దంపతులకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు మరింత సేవలందించాలని సూచించారు.

**ప్రజాకలం విశ్లేషణకు ఇప్పుడు ప్రాధాన్యం**

కక్కిరాలపల్లి సర్పంచ్ దంపతుల కాంగ్రెస్ చేరికతో "అధికార పార్టీ వైపు ఆ పల్లె సర్పంచ్ చూపు?" అంటూ గతంలో ప్రజాకలం ప్రచురించిన కథనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో లేవనెత్తిన రాజకీయ పరిణామాలు ఇప్పుడు ఆచరణలో కనిపించడంతో "ప్రజాకలం చెప్పిందే నిజమైంది" అంటూ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్, ఐనవోలు కాంగ్రెస్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పోలేపల్లి శంకర్‌రెడ్డి, జె.బి.ఎం.చైర్మన్ జన్నెపురెడ్డి, రుగ్వేదరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి మామూద్, రావుల రవి, కంజర్ల తిరుపతి, కంజర్ల రవీందర్, ఎండి అబ్బాన్ అలీ, కంజర్ల కుమార్, కాటబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ముస్లింలు కలిసిమెలిసి ఉండాలి

– గణేషుడి పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

– ముస్లిం మత పెద్దల సమావేశంలో తొర్రురు డిఎస్పి కృష్ణ కిషోర్



మరిపెడ ప్రతినిధి ప్రజా కలం న్యూస్ సెప్టెంబర్ 11

భారతదేశం వివిధ సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనం అని అన్ని కులాలు మతాలు కలగలిపిన దేశం హిందూ ముస్లిం భాయ్ భాయ్ అని పిలవబడే ఏకైక దేశం అని మరిపెడ పోలీస్ స్టేషన్ లో ముస్లిం మత పెద్దలతో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో మీడియాతో తొర్రూర్ డిఎస్పి కృష్ణ కిషోర్ మాట్లాడారు భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం గల దేశం అని, రాబోవు వినాయక చవితి పండుగ దృష్ట్యా ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకొనేలా ఒకరికొకరు సహకరించుకోవాలి అని, కోరారు పండుగ సమయంలో సోషల్ మీడియా లో వచ్చే నేర పూరిత మెసేజ్ ల పట్ల అప్రమతంగా ఉండాలి అన్నారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే నేరపూరిత మెసేజ్లు సోషల్ మీడియా గ్రూప్ లో వస్తే పోలీస్ వారికీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేసారు.

# బ్యాంకు ఉద్యోగుల జాతీయ సమ్మె

యు ఎఫ్ బి యు పిలుపుతో నాగర్‌కర్నూల్ ఎస్బిఐ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం): బ్యాంకుల్లో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని పీఎల్ఐ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ( యు ఎఫ్ బి యు ) పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు జాతీయ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. 5 రోజుల పని విధానాన్ని అమలు చేయడం ద్వారా ఉద్యోగుల పని–వ్యక్తిగత జీవన సమతుల్యత మెరుగుపడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇతర ఆర్థిక సంస్థల్లో అమలవుతున్న విధంగానే బ్యాంకింగ్ రంగంలో కూడా 5 రోజుల పని వారాన్ని అమలు చేయాలని యు ఎఫ్ బి యు నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్రజలకు మరింత సమర్థవంతమైన మెరుగైన సేవలను అందించేందుకు ఈ విధానం కీలకమని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని



నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే పీఎల్ఐ పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని ఎస్‌బీఐ శాఖల ఉద్యోగులు, అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొన్నారు. దీంతో సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలకు కొంత మేర అంతరాయం ఏర్పడింది. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ( టి జి బి ) ఉద్యోగులు కూడా మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమంలో యు ఎఫ్ బి యు ప్రతినిధులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసులు, పృథ్వీ, అభి, కిషోర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

# నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి జానకి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 11:

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. శ్రీమతి డి.జానకి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండును, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలెక్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని వారు చించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశం––నిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బేబీ పాండ్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నీటి నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం పాండ్లను శుభ్రపరిచి, అవసరమైన మేరకు నీటిని తొలగించి, ఆయా ప్రాంతాలను యథావిధిగా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బేబీ పాండ్లు, నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసేలా మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.



పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలెక్టర్ వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్.పి.లు సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార లోప రహిత జిల్లాగా నాగర్‌కర్నూల్‌ను తీర్చిదిద్దుదాం

పోషక మాసం లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలి – అదనపు కలెక్టర్ దేవ సహాయం

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం ) : పోషక మాసం లక్ష్యాలను విజయవంతంగా సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాలను గుర్తించి వారికి సకాలంలో తగిన పోషకాహారం అందించడంతో పాటు, జిల్లాను పోషకాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పోషణ్ అభియాన్–పోషక మాసం కార్యక్రమాల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ్ అభియాన్–పోషక మాసం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. "హమారీ అంగన్వాడీ–హమారీ భాగ్యదారి" అనే నినాదంతో పోషక మాసం కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తొలి దశ నుంచే సరైన పోషకాహారం అందించడం ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా బాలల ఎదుగుదల, రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యత, మహిళా–శిశు



సంక్షేమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు వైద్య ఆరోగ్య పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి విద్య మునిసిపల్ మహిళ శిశు సంక్షేమ శాఖల పరస్పర సమన్వయంతో పోషక మాంస కార్యక్రమాలను నిర్వహించాలన్నారు ప్రజా ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల మహిళలు అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయాలని సూచించారు ప్రతి అంగన్వాడి కేంద్రంలో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు పోషకాహారం పై అవగాహనను ప్రతి కుటుంబానికి తీసుకెళ్లడమే ఉసక మాంస ప్రధాన ఉద్దేశం అన్నారు పోషక మాంస నెల రోజుల రోజువారి రూపొందించిన అవగాహన పోస్టర్లు విడుదల చేశారు అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధితవివిధ శాఖల అధికారుల చేత ప్రతిజ్ఞ చేయించారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.





సదుపాయాలు మెరుగుపడితే మరింత మంది రోగులకు ఆసుపత్రిలోనే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో పరిష్కరించలేని, పైస్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులను వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన



గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. డీడబ్ల్యూవో వినూత్నతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించిన ఆయన, పోషణ మాసం కార్యక్రమాలను అక్టోబర్ 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అమరులకు నివాళులు అర్పించిన అధికారులు



నిర్మల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జాతీయ అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా గండి రామన్న అర్బన్ పార్క్ చించోలి వద్దగల అటవీ అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన నిర్మల్ అటవీ మండల అధికారి నాగిని మాను, తదితర అధికారులు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా నందు అటవీ శాఖలో విధులు నిర్వహిస్తూ అమరులైనటువంటి కుటుంబ సభ్యులకు సన్మానం చేశారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ అటవీ మండలాధికారి నిఘా విభాగం బాసర సర్కిల్, రామకృష్ణారావు ఎఫ్ఆర్ఓ, జిల్లా అటవీ క్షేత్ర అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

### ఉయ్యాలవాడ బిసి గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహణ



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యాలవాడ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ కార్యదర్శి శ్రీమతి నిహారిక హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరగడం ద్వారా సమాజంలో జరిగే అనేక నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణకు ఉద్దేశించిన పోక్సో చట్టం గురించి వివరించారు. విద్యార్థి దశ భవిష్యత్తుకు బంగారు బాట వంటిదని, విద్యార్థులు జీవితంలో గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి సంఘీభావం తెలిపిన నందిగామ బీఆర్ఎస్ నాయకులు

### ఈనాటి మేటి లీడర్..ఎమ్మెల్సీ ఎన్ఎన్ఆర్..!
### ప్రధాన ప్రతిపక్ష హోదాలో.. అసెంబ్లీ ముట్టడిలో నవీన్ రెడ్డి పాత్ర కీలకం..
### ప్రజల పక్షాన గళం వినిపించి సస్పెన్షన్ కు గురైన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి సంఘీభావం తెలిపిన గులాబీ నేతలు

నందిగామ సెప్టెంబర్ 11 ప్రజా కలం ప్రతినిధి అసెంబ్లీ ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఎమ్మెల్సీగా ప్రజల సమస్యలపై పోరుబాట చేసి సస్పెన్షన్ కు గురైన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి గారికి నందిగామ మండల కేంద్రానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.



ఈ సందర్భంగా వారు నవీన్ రెడ్డి ఇంటికి వెళ్లిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జిల్లెల్ల జనార్దన్ రెడ్డి, నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి (రామన్న), ప్రముఖ అడ్వకేట్ ఎం విక్రమ్ శర్మ తదితరులు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు. ఈ ఏటిమేటి లీడర్ గా నవీన్ కుమార్ రెడ్డి ప్రజల పక్షాన పోరుబాటలో ముందుండి షాద్నగర్ నియోజకవర్గానికి వన్నెతెచ్చారని వారు కితాబు ఇచ్చారు. రానున్న రోజుల్లో ప్రజల కోసం మరిన్ని పోరాటాలు చేయాలని ఆయన వెంట ఉంటామని వారు భరోసానిచ్చారు.

## బీసీల ధర్మ పోరాట దీక్షల సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందించిన

### జాతీయ బి.సి సంక్షేమ సంఘం నాయకులు

ఖమ్మం సెప్టెంబర్ 11( ప్రజా కలం న్యూస్) దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5- 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించింది.కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను



లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బిసీలకు అన్యాయం చేస్తుంది, రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టింది బీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ ఈనెల 11 వ తేదీన (శుక్రవారం) రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లోబీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్, గౌరవ అధ్యక్షులు బచ్చల పద్మాచారి, రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర చారి జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి పుల్లూరు వెంకన్న బాబు,నాగరాజు యాదవ్ గుడిగంటి వీరన్న రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తీగలపల్లి భూ నిర్వాసితులకు

# నష్టపరిహారం ఇవ్వాలి

### - విద్య వైద్యం సమస్యలను వెంటనే పరిష్కరించాలి
### - సిపిఎం నాయకులు పి నరసింహ డిమాండ్

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 11 ప్రజా కలం (ప్రతినిధి ) :

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన తీగలపల్లి గ్రామ భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల నాయకులు పి. నరసింహ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని విద్య, వైద్యం, రైతులు, పేదల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కోడేరు మండల కమిటీ సమావేశం శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మండలంలోని పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని అన్ని పల్లె దవాఖానాల్లో ప్రభుత్వ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరారు అలాగే జనుంపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులకు ఓఆర్‌సీలు వచ్చినప్పటికీ నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా



ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయకపోవడం అన్యాయమని సీపీఎం కోడేరు మండల కార్యదర్శి పి. రవి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకుపట్టాలు లేకపోవడం వల్ల ఆయా రైతులు రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను కూడా పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే వారికి పట్టాలు మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఆసరా, వృద్ధాప్య పింఛన్లు, రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు శివశంకర్ వై రవి ఎం వెంకటమ్మ ఇండ్ల శేఖర్ రామ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దచెరువు ట్యాంక్‌బండ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలి



### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 11:

మహబూబ్ నగర్ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల్లో మిగిలిన పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్, పక్కనే ఉన్న శిల్పారామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పెద్దచెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఇరిగేషన్ శాఖ, మూఢ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పెండింగ్ పనుల వివరాలను పరిశీలించారు. ఇప్పటికే చేపట్టిన పనులను పరిశీలించి, అవసరమైన చోట మార్పులు, అదనపు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్లను ఎవరెవరికి కేటాయించారు, వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన అన్ని స్టాళ్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అక్టోబర్ 1వ తేదీ నుంచి శిల్పారామంలోని అన్ని స్టాళ్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మిరపలో వేరు, కాండం కుళ్లు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - తెగులు నివారణకు థియోఫానేట్ మిథైల్‌తో సాయిల్ డ్రెంచింగ్ చేయాలని ఉద్యాన శాఖ సూచన

పాలేరు సెప్టెంబర్ 11(ప్రజా కలం న్యూస్ )

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మిరప తోటల్లో వేరు, కాండం కుళ్లు తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి పి. అపర్ణ సూచించారు.



తోటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. వేరు, కాండం కుళ్లు తెగులు సోకిన మొక్కల మొదళ్ల వద్ద థియోఫానేట్ మిథైల్ 70% భౌ శిలీంద్రనాశినిని లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి ద్రావణాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కలతో పాటు వాటి పక్కన ఉన్న ఆరోగ్యకరమైన మొక్కల మొదళ్ల వద్ద నేల బాగా తడిచే విధంగా సాయిల్ డ్రెంచింగ్ చేయాలని పేర్కొన్నారు.

**తోటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి**

మిరప తోటల్లో తేమ అధికంగా ఉండటం వల్ల తెగుళ్లు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు. అందువల్ల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలంలో అదనపు నీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసుకోవడం, అవసరానికి మించి నీటిని అందించకపోవడం ద్వారా తోటలో అధిక తేమను నియంత్రించవచ్చని తెలిపారు.

బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) అందుబాటులో ఉన్న రైతులు దాని ద్వారా అవసరమైన మేరకు నీటి తడులు అందించాలని సూచించారు. తోటలో అధిక తేమ లేకుండా చూసుకోవడం ద్వారా తెగుళ్ల వ్యాప్తిని కొంతవరకు నియంత్రించవచ్చని తెలిపారు.

**పూర్తిగాదెబ్బతిన్న మొక్కలను తొలగించాలి**

తెగులు తీవ్రంగా సోకి పూర్తిగా దెబ్బతిన్న మొక్కలను వేర్లతో సహా తొలగించాలని అపర్ణ సూచించారు. అయితే మొక్కలను తొలగించే సమయంలో వేర్ల చుట్టూ ఉన్న మట్టిని తోటలో ఇతర ప్రాంతాల్లో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తొలగించిన తెగులు సోకిన మొక్కలను తోటకు దూరంగా తీసుకెళ్లి కాల్చివేయాలని సూచించారు. రైతులు తమ మిరప తోటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, తెగులు ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ కోరింది. అవసరమైనప్పుడు స్థానిక ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు శిలీంద్రనాశినులను వినియోగించాలని సూచించారు.

పి. అపర్ణ ఉద్యాన అధికారి, పాలేరు డివిజన్
ఫోన్: 8977714104.

## మట్టి వినాయకులపై విద్యార్థులకు అవగాహన

### - మట్టి గణపతుల తయారీలో విద్యార్థుల ఉత్సాహం



నిర్మల్ సెప్టెంబర్ 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పర్యావరణ పరిరక్షణలో భాగంగా తానూర్ మండలం భోసి ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజశేఖర్ విద్యార్థులకు మట్టి గణపతుల వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ట్ టీచర్ శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. వివిధ ఆకృతుల్లో గణపతి విగ్రహాలను రూపొందిస్తూ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించి, అనంతరం నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా చూడవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల భద్రతపై తానూర్ లో సమన్వయ సమావేశం



తానూర్, సెప్టెంబర్ 11(ప్రజా కలం): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు తానూర్ కళ్యాణ మండపంలో అధికారులతో కలిసి ముధోల్ సీఐ రవీందర్ నాయక్ శుక్రవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి మండపం వద్ద విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు, రాత్రి వేళల్లో భద్రత కోసం మండపాల వద్ద ఇద్దరు వ్యక్తులు కాపలా ఉండాలన్నారు,డీజేలపై ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు,ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీధర్, ఎస్సై జుబేర్, మాజీ సర్పంచ్ మాధవరావు పటేల్,వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు, ఉత్సవ కమీటి నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం: వాగ్దేవి పాఠశాల డైరెక్టర్ అరవింద్ రెడ్డి




తానూర్ (ప్రజా కలం):మట్టి గణపతులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వాగ్దేవి విద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ పి. అరవింద్ రెడ్డి పిలుపునిచ్చారు,శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మంచి మార్పు మన నుంచే మొదలవ్వాలని ఆకాంక్షించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ , కృత్రిమ రంగులతో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి, వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్మాయి, డైరెక్టర్ అవినాష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### - బీజేపీ మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస్

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 11, (ప్రజాకలం) తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం ఆళ్లపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాదావత్ బద్రు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం ద్వారా నాటి అమరవీరుల త్యాగాలను



స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించి, తెలంగాణ చరిత్రతో పాటు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు సిరినోముల వజ్రం, పూణేం రాంబాబు, పడిగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకారించాలి

### శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్

ఖమ్మం సెప్టెంబర్ 11( ప్రజా కలం న్యూస్) వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ. కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# దళితులపై ఇంకెంత కాలం ఈ వివక్ష....?

**- దళితుల ఆత్మగౌరవాన్ని కించ పరిస్తే చూస్తూ ఊరుకునేది లేదు...బోయి వెంకటరమణ**

అంబర్పేట్ సెప్టెంబర్ 11(ప్రజాకలం న్యూస్)

దళితుల ఆత్మగౌరవాన్ని కించ పరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని దళిత సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ వేంకట రమణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,శాసన మండలి చైర్మన్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన వ్యాఖ్యలు బాధాకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పదవి నుండి ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



ఇది రాజకీయ విమర్శ కాదు,ఇది సంస్కారం లేని రాజకీయ భాషకు పరాకాష్ట అన్నారు. ఒక దళితుడు రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నాడనే విషయాన్ని కూడా జీర్ణించుకోలేని అహంకార రాజకీయాలకు నిదర్శనం అని మండిపడ్డారు. కేసీఆర్ ఫామ్ హౌస్ లో దళితులు డప్పులు కొట్టారని, దళితులు ఫామ్ హౌస్ లో అడుగు పెట్టారని పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేసుకున్న పెద్దమనిషికి ఇంత అహంకారం పనికిరాదని అన్నారు.మేము అంటారని వాళ్ళ మా , మేము అంటారని వాళ్ళ మైతే మా రక్తం వేరేగా ఉండాలి కదా ? ఎమర్జెన్సీ వచ్చినప్పుడు, రక్తదానం చేసింది,ఎస్సీ,ఎస్టీ,బిసి అని అడిగి రక్తం తీసుకుంటారా అని ప్రశ్నించారు. మనం భారతీయులం, సర్వమతాలు,కుల మత భేదాలకు చోటు లేకుండా చల్లంగా కాపాడుతున్న భూతల్లి, తెలంగాణ తల్లి, ఇకనైనా అహంకార రాజకీయాలకు దూరంగా ఉండాలని లేదంటే పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయని వెంకటరమణ హెచ్చరించారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రెడ్డిగళ్ల అజయ్ నియామకం

**రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తా**

మహేశ్వరం, సెప్టెంబర్ 11,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి గారి సూచనలతో రంగారెడ్డి జిల్లా



ప్రధాన కార్యదర్శి గా రెడ్డిగళ్ల అజయ్ ని నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా రెడ్డిగళ్ల అజయ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ పట్ల తనకున్న అంకితభావాన్ని గుర్తించి ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అన్న గారికి, అలాగే మహేశ్వరం నియోజకవర్గ ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటానికి తన వంతు కృషి చేస్తానని, జిల్లాలోని నాయకులను, కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి

**ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన బాచుపల్లి సర్పంచ్ సబిత యుగంధర్ రెడ్డి**

కందుకూరు, సెప్టెంబర్ 11,(ప్రజా కలం)

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని బాచుపల్లి గ్రామ సర్పంచ్ కొంతం సబిత యుగంధర్ రెడ్డి అన్నారు. కందుకూరు మండల కేంద్రం బాచుపల్లి గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సబిత యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ నరేష్, పాలకవర్గ సభ్యులు సి.హెచ్. కృష్ణ, డి. నర్సింహ, ఏ. రాజు, మానస,ఈ. ప్రమీల, ఈ. అనిత శాంతమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ జి పి ఓ అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం. శ్రీశైలం, ఎం. విజయ్, వై. కె వెంకటేష్ రాఘవేందర్, ఓ. కృష్ణ, రాము , , సుధాకర్, శ్రీశైలం, రాజశేఖర్, ఈ. శంకరయ్య, కె. మహేష్, పి. మహేందర్, గ్రామ మాజీ సర్పంచ్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.




# బొమ్మలరామారం లో బోనమెత్తిన ఎమ్మెల్యే సతీమణి బీర్ల అనిత



బొమ్మలరామారం, సెప్టెంబర్ 11(ప్రజా కలం)

బొమ్మలరామారం మండల కేంద్రంలోని శ్రీ జడల మైసమ్మ తల్లికి శుక్రవారం బీర్ల ఫౌండేషన్ చైర్మన్,ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత అమ్మవారికి బోనం సమర్పించి వడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేతాళ శ్రీనివాసుల గాంధీ మాతృమూర్తి స్వర్గీయ బేతాళ మల్లమ్మ జ్ఞాపకార్థంగా ఆయన మనుమరాలు బేతాళ ఖ్యాతి, తాడూరి ద్రితి పేర్ల మీద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి బీర్ల అనిత ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరైనారు ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు తీర్చిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు గ్రామదేవతల ఆశీర్వాదంతో పాటు ఆలేరు ప్రజల ఆశీర్వాదం ఆలేరు ఎమ్మెల్యే పై ఎప్పుడు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు ఆలేరు నియోజకవర్గ ప్రజల కోసం అనుక్షణం ఆలోచించే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబం బాగుండాలనే తలంపుతో బేతాళ శ్రీనివాసులు గాంధీ స్వకార్యాన్ని స్వామి కార్యాన్ని నెరవేర్చినట్టు తన కుటుంబ కార్యక్రమంలో కూడా ఐలయ్య కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేసినందుకు మాజీ ఉపసర్పంచ్ సీనియర్ రిపోర్టర్ బేతాళ శ్రీనివాస్ కుటుంబం కూడా చల్లగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ,ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పడమటి పావని,కాంగ్రెస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు యాంజాల కళ,డిసిసి అధికార ప్రతినిధి తిరుమల కవిత, డిసిసి ప్రధాన కార్యదర్శి ధానవత్ సునీత,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఫకీరు సంగీత, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఎడమ పుష్ప తో పాటు సర్పంచులు యంజాల సరస్వతి,మాడావత్ తార, ధీరావత్ సునీత తో పాటు సింగిల్ విండో డైరెక్టర్లు ఆత్మ కమిటీ డైరెక్టర్లు పలు గ్రామాల ఉపసర్పంచ్లు గ్రామ శాఖ అధ్యక్షుల తో పాటు జడల మైసమ్మ అన్నదాన నిర్వహణ కమిటీ సభ్యులు కుక్కదువు గణేష్, బండి మహేష్ గౌడ్, జూపల్లి భరత్,గుండోజి మోహన్ తో పాటు గ్రామ పెద్దలు కట్ట శ్రీకాంత్ గౌడ్, ఉప సర్పంచ్ ఎలబోయిన జంగయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుదే బాలనరసింహ, మాజీ సర్పంచ్ రాంపల్లి మహేష్ గౌడ్ పాల్గొన్నారు

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలి: గజ్వేల్ సీఐ రవికుమార్**



గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి):

రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించాలని గజ్వేల్ సీఐ రవికుమార్ సూచించారు.శుక్రవారం సాయంత్రం గజ్వేల్‌లోని కోలాభిరామ్ ఫంక్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవాల సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశంలో వివిధ మతాలకు చెందిన మతపెద్దలు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు అవసరమైన సమాచారం,సంబంధిత పత్రాలను తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించి, మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు.మండపాల వద్ద విద్యుత్,అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, రాత్రివేళ కనీసం ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. మండపాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తగా రెండు డ్రమ్ముల్లో ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.అధిక శబ్దంతో డీజేలు,సౌండ్ సిస్టమ్స్ వినియోగించకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని సూచించారు.ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నినాదాలు,పాటలు లేదా చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు,తప్పుడు సమాచారాన్ని నమ్మడం లేదా ప్రచారం చేయకుండా,అలాంటి సమాచారం దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గణేష్ ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని,నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు,వాలంటీర్లు పోలీస్ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. మహిళలు,పిల్లలు,వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని సీఐ రవికుమార్ తెలిపారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులను కోరారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు,ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,మతపెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని రైతులు డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-ఏం.మౌనిక, వ్యవసాయ విస్తరణ అధికారి**

బొమ్మలరామారం, సెప్టెంబర్ 11 (ప్రజా కలం) మండలంలోని మర్యాల క్లస్టర్ రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన పంట వివరాల నమోదు (డిజిటల్ పంట సర్వే) కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.మౌనిక తెలిపారు. ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి రైతు సాగు చేస్తున్న పంట, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం మరియు ఇతర వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు తాము సాగు



చేస్తున్న వరి రకం మరియు సాగు విస్తీర్ణాన్ని పంట నమోదు సిబ్బందికి ఖచ్చితంగా తెలియజేయాలని, పంట నమోదులో నమోదైన వివరాల ఆధారంగానే సన్న రకాల వరికి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ అందించే ప్రక్రియలో పరిగణన జరుగుతుందని తెలిపారు. అలాగే పంట నమోదు వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంటల ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు పంట నమోదు సిబ్బంది తమ గ్రామానికి వచ్చినప్పుడు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, తాము సాగు చేస్తున్న పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకోవడం ప్రతి రైతుకు ఎంతో ముఖ్యమైనదని, ఇప్పటివరకు తమ పంట వివరాలను నమోదు చేయించుకోని రైతులు సంబంధిత పంట నమోదు సిబ్బందిని సంప్రదించి వెంటనే నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు కార్యక్రమానికి సంబంధించి ఏవైనా సందేహాలు,సమస్యలు లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే సమీప రైతువేదికను మెసేజ్ వచ్చిన 72 గంటల లోపు సంప్రదించాలని తెలిపారు. పంట నమోదు చివరి తేదీ 30-09-2026 అని, గడువులోగా ప్రతి రైతు తమ పంట వివరాలను నమోదు చేయడం జరుగుతుంది వ్యవసాయ విస్తరణ అధికారి . ఎం. మౌనిక రైతులను కోరారు.

# బెగరికంచలో భూ వివాదం

**- అవార్డును నిలిపివేయాలని ఆర్డీవో కు ఫిర్యాదు**
**- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం**
**- రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గుండ్రపల్లి మహేందర్**
**- తెలంగాణ రాష్ట్ర మహిళా హక్కుల వేదిక అధ్యక్షురాలు ఇంద్ర**
**-బడంగ్‌పేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు**

కందుకూరు, సెప్టెంబర్ 11,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం బెగరికంచ గ్రామంలోని సర్వే నంబర్ 145 లో గల 6 ఎకరాల 37 గుంటల భూమికి సంబంధించిన



అవార్డు మరియు నష్టపరిహారం ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గోపాల భూచమ్మ ఆర్డీవో కి అభ్యంతర పిటిషన్ సమర్పించారు.అవార్డు లిస్టులో పేర్కొన్న 23 మంది వ్యక్తుల హక్కులు, వారికి కేటాయించిన భూమి విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులు మరియు వాస్తవ స్వాధీనంలో ఉన్న భూమిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు.విచారణ పూర్తయ్యే వరకు అవార్డు లిస్టును మరియు నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్డిఓ ని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గుండ్రపల్లి మహేందర్, తెలంగాణ రాష్ట్ర మహిళా హక్కుల వేదిక అధ్యక్షురాలు ఇంద్ర, బడంగ్‌పేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు, మీర్‌పేట్ మహిళా అధ్యక్షురాలు పద్మశ్రీ, అందుగుల నరేందర్, కడ్తాల్ జగన్, స్వర్ణగంటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలంలో రోడ్ల సమస్యలపై మహా పాదయాత్ర

**- మహేశ్వరం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు మహా పాదయాత్ర**
**- రోడ్ల సమస్యలను పరిష్కారం చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**
**- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్**
**- మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ - మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి**

మహేశ్వరం, సెప్టెంబర్ 11,(ప్రజా కలం)

మహేశ్వరం మండలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లు, గుంతల మయంగా మారిన రహదారులతో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర రవాణా ఇబ్బందుల పరిష్కారం కోసం మహేశ్వరం నుండి కొంగరకలాన్ లోని జిల్లా కలెక్టరేట్ వరకు మహా పాదయాత్ర నిర్వహించడం జరిగింది.హెచ్.ఏ.ఎం ప్రాజెక్ట్ కింద మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాని 12 రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని రోడ్ల దుస్థితిపై తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారిని కలిసి రోడ్ల సమస్యల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అందజేశా రు. వెంటనే స్పందించి రోడ్ల పనులు ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కో-కన్వీనర్ కాసుల అనంతయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు పంత్తు నాయక్, మాజీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మాధవ్ చారి, జిల్లా కార్యదర్శి ఆఇళ్ల యాదయ్య గౌడ్, హన్మాత్ నాయక్, కాసాని వెంకటేష్ గౌడ్, కుండే కుమార్, ప్రధాన కార్య




దర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, మండల కార్యదర్శి బొమ్మ దేవేందర్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోల్లూరు మాధవ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రఘు వీర్, మండల యువ మోర్చా అధ్యక్షులు వినోద్ నాయక్, మండల అధికార ప్రతినిధి గుత్తి రాజు, గౌరవ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీల్లో కుకునూరు జట్టు హవా

**- జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో ప్రథమ బహుమతులు**

**- పడగల్‌లో ముగిసిన వేల్పూరు మండల అంతర పాఠశాలల క్రీడోత్సవాలు**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 11:
వేల్పూర్ మండల అంతర పాఠశాలల క్రీడోత్సవాలలో భాగంగా నిర్వహించిన బాలికల వాలీబాల్ పోటీల్లో కుకునూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఘన విజయం సాధించారు. శుక్రవారం జెడ్పీహెచ్ఎస్ పడగల్ పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో అటు జూనియర్, ఇటు సబ్ జూనియర్ గర్ల్స్ రెండు విభాగాల్లోనూ కుకునూరు విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు (షీల్డ్‌లు) కైవసం చేసుకున్నారు.




క్రీడోత్సవాల కన్వీనర్ పెంట జలంధర్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో పడగల్ గ్రామ సర్పంచ్ నల్ల రాజు, ఉప సర్పంచ్ గైని నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఏ. బాజారావు, ఎర్రం గంగాధర్, కొట్టాల నర్సారెడ్డి, తలారి వినోద్, బింగి శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
మండల స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాల కీర్తిని పెంపొందించిన క్రీడాకారిణులను కుకునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హరిచరణ్, ఉపాధ్యాయులు డాక్టర్ పతాని గంగాధర్, జి. రవీందర్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలి

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు- సుర్వి యాదయ్య గౌడ్

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 11 (ప్రజా కలం) వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,సర్పంచుల సంగం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 8 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేకపోతుందని అన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ కోతలు,వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, పంపులు కాలిపోతూ రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లో-వోల్టేజ్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ లైన్లను బలోపేతం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని సుర్వి యాదయ్య గౌడ్ స్పష్టం చేశారు.ఈ మహాధర్నాలో సీనియర్ నాయకులు తెలంగాణ బిక్షం,చిలువేరు బిక్షపతి,బొడ్డుపెల్లి గాలయ్య, జక్కిడి యాదిరెడ్డి, ఉపల ఆంజనేయులు, పాలకూర్ల సతీష్ గౌడ్,డాక్టర్ ఎర్రోళ్ల లింగస్వామి,రాసాల వెంకటేశం,చిలువేరు శంకర్, ఎడ్ల సత్తయ్య యాదవ్,ఎర్రోళ్ల వెంకటేష్, చిలువేరు వెంకటేశం, బొమ్మగోని రమేష్ గౌడ్,పవన్ కళ్యాణ్,నేనావత్ జగ్గు, మారగోని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణను రక్షిద్దాం... ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్

## -పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థులు

మేడిపల్లి సెప్టెంబర్ 11(ప్రజాకలం న్యూస్)
పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం మేడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతతో వివిధ రకాల మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఉత్తమ విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్య ప్రసాద్, ఉపాధ్యాయులందరూ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.



# భీంగల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 11:
నిజామాబాద్ జిల్లా భీంగల్ పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను మొత్తం కలియతిరిగిన ఆయన, రికార్డులను పరిశీలించి స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లలో బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, రిసెప్షన్ సెంటర్లు, కంప్యూటర్ సిబ్బంది పనితీరు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. స్టేషన్‌లో 5ఎ విధానం అమలు తీరును మరియు వాహనాల పార్కింగ్‌ను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి, వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. గంజాయిపై ఉక్కుపాదం.. సైబర్ నేరాలపై అవగాహన యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మహమ్మారిపై పటిష్ట నిఘా ఉంచాలని, రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా గంజాయికి బానిసలైతే వారికి తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అలాగే ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, బెట్టింగ్ మరియు గేమింగ్ అప్లికేషన్ల ద్వారా ప్రజలు మోసపోకుండా నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. నియోజకవర్గ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనదారులకే జరుగుతున్నాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వర్ రెడ్డి, భీంగల్ సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్ఐ సి. హెచ్. తిరుపతి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల కట్టడికి కఠిన చర్యలు

**- పండుగల వేళ పటిష్ఠ బందోబస్తు.. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా**

**- రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్ల గుర్తింపు.. 24/7 వాహన తనిఖీలు**




నిజామాబాద్, సెప్టెంబరు 11 (ప్రజా కలం ప్రతినిధి):
ఆర్మూర్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. భీంగల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం పెండింగ్ కేసుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. హత్యలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి, పేకాట, గుట్కా తదితర కేసులపై చర్చించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు కొనసాగించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై ఉన్నవారిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు.

**ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి**

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవింగ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, వాహన తనిఖీలు 24 గంటలూ కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. డయల్-112పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ జె.వెంకటేశ్వర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, ఇన్‌స్పెక్టర్ ఆర్.అంజయ్యతో పాటు సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్కోలైఫ్‌కు రూ.40.45 కోట్ల నిధులు

**కూలింగ్-యాజ్-ఎ-సర్వీస్ విస్తరణకు ప్రీ-సిరీస్-ఏ నిధులు**

**10 వేల నుంచి 40 వేల ఏసీ యూనిట్లకు విస్తరణ లక్ష్యం**




ముంబై, సెప్టెంబరు 11
(ప్రజా కలం ప్రతినిధి):
వ్యాపార సంస్థలకు కూలింగ్-యాజ్-ఎ-సర్వీస్ (సీఏఏఎస్) అందిస్తున్న సర్కోలైఫ్ 4.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.40.45 కోట్లు) ప్రీ-సిరీస్-ఏ నిధులు సమీకరించింది. పాలీక్యాబ్ ఇండియా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రారంభ పెట్టుబడిదారు, మెంటర్ భరత్ జైసింఘానీ నేతృత్వంలో ఈ నిధుల సమీకరణ జరిగింది.
ప్రస్తుతం ఐదు నగరాల్లో సుమారు 10 వేల యాక్టివ్ ఏసీ సబ్‌స్క్రిప్షన్లు కలిగిన సంస్థ.. రానున్న 24 నెలల్లో దేశవ్యాప్తంగా 40 వేల యూనిట్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఏసీ సముదాయం, ఇన్‌స్టాలేషన్, ఫీల్డ్ సర్వీస్ వ్యవస్థలను భారీగా విస్తరించనుంది.
ఏసీ నిర్వహణ బాధ్యతంతా సంస్థదే
సబ్‌స్క్రిప్షన్ విధానంలో వ్యాపార సంస్థలు నెలవారీ చెల్లింపులు చేస్తే సరిపోతుంది. ఏసీ నిర్వహణ, మరమ్మతులు తదితర బాధ్యతలను సర్కోలైఫ్ చూసుకుంటుంది. ప్రతి యూనిట్‌ను ఇంధన సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.
సెన్సర్ల ద్వారా ఉష్ణోగ్రత, విద్యుత్ వినియోగం, గ్యాస్ పీడనాన్ని రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తూ.. సమస్య తలెత్తకముందే గుర్తించే ఐఓటీ ఆధారిత ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ వ్యవస్థను సంస్థ అభివృద్ధి చేస్తోంది. ఏఐ, డిజిటల్ ట్విన్ సాంకేతికతలను మరింత విస్తరించనుంది.
నిధులు ఎక్కడికి?
కొత్తగా సమీకరించిన నిధులతో దేశవ్యాప్తంగా కార్యకలాపాల విస్తరణ, ఏసీ యూనిట్ల పెంపు, సొంత ఇన్‌స్టాలేషన్, సర్వీస్ బృందాల విస్తరణతో పాటు ఏఐ ఆధారిత ఐఓటీ ప్లాట్‌ఫారమ్ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టనుంది.
రెస్టారెంట్లు, హోటళ్లు, జిమ్‌లు, సెలూన్లు, కో-లివింగ్ సంస్థలు తదితర వ్యాపారాలు సంస్థకు వినియోగదారులుగా ఉన్నాయి. 2023 చివర్లో ముంబైలో కార్యకలాపాలు ప్రారంభించిన సర్కోలైఫ్ ప్రస్తుతం ఐదు నగరాల్లో సేవలు అందిస్తోంది.
ఈ రౌండ్‌లో నజారా టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు నితీష్ మిట్టర్సైన్, ఇంటెలిక్విటీ వెంచర్స్, పరమ్ క్యాపిటల్ తదితర పెట్టుబడిదారులు కూడా పాల్గొన్నారు. సర్కోలైఫ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అభిషేక్ మురార్కా మాట్లాడుతూ.. 10 వేల సబ్‌స్క్రిప్షన్లతో వ్యాపార నమూనా విజయవంతమైందని, తాజా నిధులతో జాతీయ స్థాయిలో విస్తరణకు అవసరమైన సాంకేతిక, సేవా మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.




# విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన 'ముఖాముఖి' సుంకెట్ జడ్పీహెచ్ఎస్‌లో వినూత్న ప్రాజెక్టు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 11:
విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సమాజంలోని ప్రముఖుల అనుభవాలను పరిచయం చేసినప్పుడే వారిలో సరికొత్త స్ఫూర్తి రగులుతుందని మోర్తాడ్ మండలంలోని సుంకెట్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని సుంకెట్ జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి విద్యార్థులకు 'నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫోరా-2)' తెలుగు ప్రాజెక్టులో భాగంగా వినూత్నంగా 'ముఖాముఖి (ఇంటర్వ్యూ)' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రముఖురాలు వనజా నర్సా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె ఎంతో ఓపికగా, ఆకట్టుకునేలా సమాధానాలిచ్చారు. అనంతరం వనజా నర్సా గౌడ్ మాట్లాడుతూ.. ఇలాంటి ప్రయోగాత్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని, పట్టుదలను, నిరంతర కృషిని పెంపొందిస్తాయని ప్రశంసించారు. ప్రాథమిక దశలోనే పిల్లలకు ముఖాముఖి ప్రక్రియను పరిచయం చేయడం అభినందనీయమని హెచ్ఎం కొనియాడారు. తమ కొరకు సమయాన్ని కేటాయించి పిల్లలను ప్రోత్సహించినందుకు గాను ముఖ్య అతిథికి తెలుగు ఉపాధ్యాయులు చిట్యాల నర్సింగ్ దాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సొత్తు భద్రం.. బాధితురాలికి అప్పగించిన కమ్మర్‌పల్లి పోలీసులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 11:
ప్రయాణంలో పోగొట్టుకున్న నగదు, బంగారాన్ని సాంకేతికత సాయంతో కమ్మర్‌పల్లి పోలీసులు వేగంగా రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సారంగాపూర్‌కు చెందిన జులేఖా బేగం గురువారం నిజామాబాద్ నుంచి చౌట్‌పల్లిలో జరిగే బంధువుల వివాహానికి ఆటోలో బయలుదేరారు. ప్రయాణంలో ఆమె తన పర్సును నిర్లక్ష్యంగా పోగొట్టుకున్నారు. ఆ పర్సులో ఒక




తులం బంగారు కమ్మలు, రూ. 1,000 నగదు మరియు ఒక సెల్ ఫోన్ ఉన్నాయి. సొత్తు పోవడంతో కంగారుపడిన బాధితురాలు కమ్మర్‌పల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఎస్ఐ సిహెచ్. సతీష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఎం. వెంకట్ కుమార్, కానిస్టేబుల్ కె. దినేష్‌లు తక్షణమే దర్యాప్తు చేపట్టారు. పర్సులో ఉన్న సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా లొకేషన్‌ను ట్రేస్ చేసి, పర్సును సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో బాధితురాలిని పిలిపించి సదరు సొత్తును ఆమెకు అప్పగించారు. పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు పోగొట్టుకున్న బంగారాన్ని, నగదును తిరిగి తెచ్చిచ్చిన పోలీసుల సమర్థతను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో లేదా అత్యవసర సమయాల్లో ప్రజలు 'డయల్ 112' సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. సకాలంలో స్పందించి తమ సొత్తును భద్రంగా అందజేసిన కమ్మర్‌పల్లి పోలీసులకు జులేఖా బేగం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# భూమి పూజకు ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలి

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల విజయభాస్కర్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజా కలం ప్రతినిధి)
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో నిర్వహించనున్న భూమి పూజ (శంకుస్థాపన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల విజయభాస్కర్ కోరారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య మహాసభకు కేటాయించిన స్థలంలో ఆదివారం ఉదయం 8 గంటలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం శ్రీనివాస కల్యాణం, ఉదయం 10.30 గంటలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు విజయభాస్కర్ తెలిపారు. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఆర్యవైశ్య ప్రముఖులు టీజీ వెంకటేష్, బొగ్గారపు దయానంద్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బిగాల గణేష్ గుప్తా, కోలేటి దామోదర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు చెప్పారు.ఈ భూమి పూజ కార్యక్రమం ఆర్యవైశ్య మహాసభకు ఎంతో ప్రతిష్టాత్మకమైనదని పేర్కొన్న ఆయన, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, పట్టణాల నుంచి ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# తుర్కపల్లి ఐటీ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

## బొమ్మలరామారం మండలంలో ఉన్న టైర్ల పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

### - ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తెలంగాణ ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు,పరిశ్రమల కాలుష్య సమస్యలపై ప్రభుత్వ దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో ఐటీ పార్క్ ఏర్పాటు కోసం సుమారు 110 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించడం జరిగిందని తెలిపారు. తుర్కపల్లి మండలం గిరిజన తండాలు, వెనుకబడిన గ్రామాలతో కూడిన ప్రాంతమని,ఇక్కడ ఐటీ పార్క్‌లో ఐటీ సంస్థలు, పరిశ్రమలు,ఇతర ఉపాధి కల్పించే సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. తుర్కపల్లి ప్రాంతంలో ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రముఖ సంస్థలను ఆకర్షిస్తే స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి స్థానిక యువతకు తగ్గుతుందని, తద్వారా తుర్కపల్లి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తుర్కపల్లి ప్రాంతంలో 110 ఎకరాల భూమిని ఐటీ పార్క్ కోసం సేకరించాం. ఇక్కడ పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఐటీ పార్క్‌ను త్వరగా అభివృద్ధి చేయాలి" అని బీర్ల అయిలయ్య కోరారు.

**టైర్ల పరిశ్రమల కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి.**

ఆలేరు నియోజకవర్గంలోని కాటేపల్లి,బొమ్మలరామారాం మండలం రంగపూర్ తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న టైర్ పరిశ్రమల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీర్ల అయిలయ్య శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు.టైర్ల పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్య కారకాల వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలుష్యానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసి ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, సంబంధిత అధికారులు టైర్ పరిశ్రమలను సమగ్రంగా తనిఖీ చేసి,



కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని బీర్ల అయిలయ్య కోరారు. తుర్కపల్లి ఐటీ పార్క్ ద్వారా యువతకు ఉపాధి -- కాలుష్య నియంత్రణ ద్వారా ప్రజలకు ఆరోగ్యం అనే లక్ష్యంతో ప్రభుత్వం రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర మంత్రి దుగ్గిళ్ళ శ్రీధర్ బాబు కు వినతి పత్రం అందజేసిన ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వనంపల్లి జైపాల్ రెడ్డి, సిపిఐ పార్టీ శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రా గిరి**

శంషాబాద్, సెప్టెంబర్ 11, (ప్రజా కలం)

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పరిధిలో అంబేద్కర్



చౌరస్తా దగ్గర ఐదు రూపాయల భోజనం క్యాంటీన్ ని ఏర్పాటు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వనంపల్లి జైపాల్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం సిపిఐ పార్టీ శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రా గిరి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుగ్గిళ్ళ శ్రీధర్ బాబు ని కలసి మినిస్టర్ కార్యాలయంలో లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి కార్మికులు జీవనో ఉపాధి కోసం శంషాబాద్ కు వలస కార్మికులు వేలాదిగా నివసిస్తున్నారు. లేబర్ అడ్డాల దగ్గర ఉపాధి లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాదిమంది కార్మికులు ఉన్నందున శంషాబాద్ లోనీ అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఐదు రూపాయల భోజనాన్ని (ఇందిరమ్మ క్యాంటీన్) ఏర్పాటు చేయాలని శ్రీధర్ బాబు గారిని కోరడం జరిగింది. తప్పకుండా శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనాన్ని ఏర్పాటు చేసే విధంగా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

## దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు

### బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డి లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 11( ప్రజా కలం):

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం




దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి ఛైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై అవమానమా?

### -ఎర్వల్లి ఘటనపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆగ్రహం..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

ఎర్వల్లి, వరదరాజపూర్ గ్రామాల్లో దళితుల నిరసన అనంతరం పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు తీవ్ర ఆగ్రహం



వ్యక్తం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం వంటి భావజాలాలకు సమాజంలో స్థానం లేదని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం కల్పించిందని గుర్తుచేశారు. ఎర్వల్లి ఘటనపై కేసీఆర్,హరీశ్‌రావు, కేటీఆర్ స్పందించి దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు,గిరిజనులు, మైనారిటీల ఆత్మగౌరవం విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. సామాజిక సమానత్వం,రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు..

# తుక్కుగూడ ప్రైమ్ కేర్ ఆస్పత్రి పై చర్యలు ఏవి?

- ప్రైమ్ కేర్ ఆస్పత్రి పై చర్యలు తీసుకోవడంలో అధికారుల మౌనం
- ఒక గిరిజన బిడ్డకు అన్యాయం జరిగితే ఎవరు స్పందించకపోవడం ఏంటి
- ప్రైమ్ కేర్ హాస్పిటల్ అసలు యజమాని ఎవరు దాని వెనుక ఎవరున్నారు వాస్తవాలు బయటికి రావాలి - తక్షణమే ప్రాముఖ్యత ఆసుపత్రిని సీజ్ చేయాలి
- ఎంత జరుగుతున్న డిఎంహెచ్ఓ అధికారులందరూ మౌనం ఎందుకు
- ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వెనుక పలు అనుమానాలు

### -సి పి ఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 11, (ప్రజా కలం)

తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో ఒక గిరిజన బిడ్డకు జరిగిన ఘోర అన్యాయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంపై సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైమ్ కేర్ ఆస్పత్రి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా ఘోరమైన తప్పిదం జరిగినా, జిల్లా డీఎంహెచ్‌వో అధికారి కనీసం ఏం జరిగిందో కూడా విచారణ చేయలేదని



ఆరోపించారు. ఆస్పత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డం వెనుక అధికారులపై అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అసలు ఆస్పత్రి యాజమాన్యం ఎవరు? దీని వెనుక ఎవరున్నారు? అనే కోణంలో పూర్తి విచారణ జరిపించి, ఆస్పత్రిని వెంటనే సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా డీఎంహెచ్‌వో మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పూర్తిగా దర్యాప్తు చేయకుండానే కేసును క్లోజ్ చేయాలని చూస్తున్నారని, ఆస్పత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు."ఎక్కడ ఏం జరిగినా రాద్ధాంతం చేసే రాజకీయ నాయకులు, మేధావులు, మహిళా సంఘాలు, మీడియా, సోకాల్డ్ యూట్యూబ్ ఛానల్స్ ఎక్కడికి పోయాయి? అందరూ నిద్రపోతున్నారా? నిద్రపోయినట్లు నటిస్తున్నారా? గిరిజన బిడ్డకు ఎవరూ లేరని, ఎవరూ ప్రశ్నించరని, ఏం జరిగినా పట్టించుకోరనే ధైర్యంతో ఉన్నారా?" అని ఆయన నిలదీశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పినా, అధికార యంత్రాంగం కదలడం లేదంటే ఎంత నిర్లక్ష్యం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఆస్పత్రిపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. వెంటనే గిరిజన బిడ్డకు న్యాయం చేయాలని, ఈ విషయంలో రాష్ట్ర హోంమంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మల్లన్నసాగర్ నిర్వాసితుల త్యాగాలను మరిచారా?

### -బహుజనుల సమస్యలపై ఇక సమరమే.. -తెలంగాణ రక్షణ సేనతోనే సామాజిక న్యాయం

### -12వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరణలో గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి

గజ్వేల్: 11 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల త్యాగాలను పాలకులు విస్మరించారని తెలంగాణ రక్షణ సేన పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజనుల సమస్యలు, సామాజిక న్యాయం కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆయన అన్నారు. గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలోని 12వ వార్డులో శుక్రవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను కొట్టాల యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీని అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రంలో అభివృద్ధి, బహుజనుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పార్టీని స్థాపించామని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని కల్వకుంట్ల కవిత ప్రకటించారని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం భూములు,పుట్టిన ఊళ్లను త్యాగం చేసిన నిర్వాసితుల త్యాగాల ఫలితంగానే రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందుతోందని యాదగిరి పేర్కొన్నారు.

అలాంటి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వారి కన్నీళ్లు తుడిచే పాలకులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని,ప్రస్తుత ప్రభుత్వం కూడా హామీలతో ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. కన్నతల్లి లాంటి పుట్టిన ఊరిని,సొంత భూము లను వదిలి పునరావాస కాలనీల్లో దిక్కుతోచని పరిస్థితుల్లో జీవిస్తున్నామని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు.

ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తమకు రావాల్సిన ప్యాకేజీలను పూర్తిస్థాయిలో అందించకపోవడంతో అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపిం చారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం పుట్టిన టీఆర్ఎస్ పార్టీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమవుతోందని యాదగిరి అన్నారు. ఉద్యమకారులు, నిరుద్యోగు లు, బహుజనులు, ప్రజలు పార్టీకి మద్దతుగా నిలిచి ఉద్యమ ఆకాంక్షల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు ఎల్లప్పుడూ ప్రాధాన్య త ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో కొల్లాపూర్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జి పగిడాల శ్రావణి,రాష్ట్ర నాయకులు పిట్ల విజయలక్ష్మి,మాజీ ఎంపీటీసీ నర్సింహులు, కూరాకుల శ్రీకాంత్,లింగని రాజు,కనకరాజు, నాంపల్లి,స్వామి, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# డ్రైనేజీకి నిధుల వరద..

## -శాంతినగర్‌లో రూ.19 లక్షల పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు,జేపీ కాలనీ డివిజన్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్



రెడ్డి తెలిపారు. శాంతినగర్ కాలనీలో వర్షపు నీరు నిలిచిపోకుండా రూ.19 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కాలువల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ, వర్షపు నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, కాలనీ అధ్యక్షులు అంజిరెడ్డి, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, ఏఈ లావణ్య, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు..

# మట్టి గణపతికి గీతం జైకొట్టు..

## -పర్యావరణహిత వినాయక విగ్రహాలతో సందేశం..

పటాన్‌చేరు, సెప్టెంబర్ 11 (ప్రజా కలం) ప్రతినిధి

పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధునిక సాంకేతికతపై గీతం విద్యార్థులు అవగాహన చాటారు. వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించాలన్న సందేశంతో హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎకో–ఏకదంత



కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సహజ మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, విషపూరిత రంగులు, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండాలని సూచించారు. మరోవైపు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ, అనలాగ్ సాంకేతికత, ఇంజినీరింగ్ భవిష్యత్తు అంశంపై ఆస్టర్ క్వాంటా వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రదీప్ వి. పైదా ఉపన్యాసం చేశారు. కృత్రిమ మేధ, వీఎల్ఎస్ఐ రూపకల్పన, సెమీకండక్టర్ సాంకేతికతలో వస్తున్న మార్పులను వివరించారు. విద్యార్థులు విమర్శనాత్మక ఆలోచన, నిరంతర అభ్యాసంతో సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ఎం. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# ఆదర్శ బోధనకు అరుదైన గౌరవం

## - ఘనపూర్ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కెందర్ల శాంత

## - అంకితభావంతో విద్యాబోధనకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం

ఘనపూర్:11 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఘనపూర్: విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న కెందర్ల శాంత ఘనపూర్ మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.ఉపాధ్యాయ వృత్తిపట్ల ఆమెకున్న నిబద్ధత, క్రమశిక్షణ,సేవాభావం,విద్యార్థుల పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ పురస్కారం ప్రతీకగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు.పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ,వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో శాంత చేస్తున్న కృషి అభినందనీయమని విద్యాభిమానులు కొనియాడారు.విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ,విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా ఆమె అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న కెందర్ల శాంతకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, విద్యాభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో ఆమె మరిన్ని పురస్కారాలు అందుకుని,మరింత మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.



# ఉద్యమాల గడ్డ నుంచే తొలి పోరు

వరంగల్ : తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తెరలేపిన కల్వకుంట్ల కవిత, తన కొత్త రాజకీయ వేదిక తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తొలి సమరానికి చారిత్రక నగరం వరంగల్‌ను ఎంచుకున్నారు. ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఓరుగల్లు గడ్డ నుంచే తన పార్టీ ఎన్నికల ప్రస్థానం మొదలుకానుందని హనుమకొండ వేదికగా కవిత ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. సరికొత్త పేరు, పాత సెంటిమెంట్‌ల కలబోతతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ మనుగడను, భవిష్యత్ రాజకీయ బలాన్ని నిర్ణయించే కీలక అగ్నిపరీక్షగా మారనున్నాయి.కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కవిత రంగంలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.13వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆమె నిరసన బాట పట్టారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన కవిత, అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజకీయాల్లో కొత్తగా ఆవిర్భవించిన ఏ పార్టీకైనా క్షేత్రస్థాయి క్యాడర్ బలం, ఓటు బ్యాంక్ నిర్మాణమే అతిపెద్ద సవాలు. కవిత తెలంగాణ రక్షణ సేనను ప్రకటించిన నాటినుంచీ ఆమె రాజకీయ ప్రభావం ఎంతవరకు ఉంటుందనే



సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పోటీ చేయాలనే నిర్ణయం ఆ పార్టీకి ఒక కత్తిమీద సాము వంటిది.వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే పటిష్టమైన క్యాడర్‌తో ఉన్నాయి. అలాంటి త్రిముఖ పోటీ వాతావరణంలో టీఆర్ఎస్ తనకంటూ సొంత ఓటు శాతాన్ని రాబట్టుకోగలదా లేదా అన్నది ఈ ఎన్నికల్లోనే తేలిపోనుంది. అన్ని డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోవడమే కవిత వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, బలమైన అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవడంలో పార్టీ ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది కీలకం. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించి, ప్రజా సమస్యల ద్వారా పాలకులపై పోరాడటం ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత ఆశిస్తున్నారు.రాష్ట్ర రాజకీయాల్లో తాము నామమాత్రపు పాత్రధారులం కాదని, ప్రత్యర్థులకు గట్టి సవాలు విసరగల పూర్తిస్థాయి ప్రత్యామ్నాయ శక్తినని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కవితపై ఉంది. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కవిత కొత్త ప్రస్థానానికి నైతిక స్థైర్యాన్ని ఇస్తాయా, లేక ఎదురీతను తప్పించవా అనేది త్వరలోనే తేలనుంది. ఈ ఎన్నికల వేదికపై తెలంగాణ రక్షణ సేన ప్రదర్శించే ప్రభావమే ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ మనుగడను దిశానిర్దేశం చేయనుంది.

# రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్ : టీవీ9 వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో వి. రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అసోసియేటెడ్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య హక్కుల వివాదంలో ఆయనపై నమోదైన ఫోర్జరీ, మోసం, కుట్ర ఆరోపణలకు సంబంధించిన రెండు క్రిమినల్ కేసులను పునరుద్ధరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సెప్టెంబర్ 9న విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి ఆధారాలు కనబడలేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రవిప్రకాశ్‌పై నమోదైన రెండు క్రిమినల్ కేసుల విచారణ యథావిధిగా కొనసాగనుంది.టీవీ9 బ్రాండ్‌తో ఛానళ్లను నిర్వహిస్తున్న ఏబీసీపీఎల్‌లో యాజమాన్య మార్పు సందర్భంగా ఈ వివాదం మొదలైంది. 2018లో అలందా మీడియా సంస్థ ఏబీసీపీఎల్‌లో 90.54% వాటాను కొనుగోలు చేసింది. అనంతరం అలందా మీడియా ప్రతినిధి పి. కౌశిక్ రావు 2019లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు రెండు వేర్వేరు ఫిర్యాదులు చేశారు.నటుడు శివాజీకి రూ.20 లక్షలకు 40,000 ఈక్విటీ షేర్లను విక్రయించినట్లు రవిప్రకాశ్ ఒక నకిలీ ఒప్పంద పత్రాన్ని సృష్టించారని క్రైమ్ నెం. 84/2019లో ఆరోపించారు. కొత్త యాజమాన్యాన్ని అడ్డుకునేందుకే ఈ ఫోర్జరీ పత్రాలను ఉపయోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును కూకట్‌పల్లి కోర్టు స్వీకరించి, సీసీ నెం. 9286/2022గా విచారణ జరుపుతోంది.రెండో ఫిర్యాదు (క్రైమ్ నెం. 87/2019) ప్రకారం, కంపెనీ సెక్రటరీ దేవేందర్ అగర్వాల్ సంతకాన్ని రవిప్రకాశ్ ఫోర్జరీ చేశారని ఆరోపించారు. కొత్త డైరెక్టర్ల నియామకాన్ని అడ్డుకోవడానికి, దేవేందర్ అగర్వాల్ రాజీనామా చేసినట్లు ఒక తప్పుడు పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద అప్‌లోడ్ చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. ఈ కేసు సీసీ నెం. 9288/2022గా విచారణలో ఉంది.

ప్రభుత్వ ఉపసంహరణ ప్రయత్నం, హైకోర్టు జోక్యం

ఈ కేసులు విచారణలో ఉండగా, 2024 మార్చి 15న తెలంగాణ ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ప్రాసిక్యూషన్‌కు విజయావకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇది సివిల్ వివాదం లాంటిదని పేర్కొంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీని ఆధారంగా కూకట్‌పల్లి కోర్టు 2024 జూన్ 8న కేసుల ఉపసంహరణకు అనుమతి ఇచ్చింది.అయితే, కౌశిక్ రావు ఈ నిర్ణయాన్ని తెలంగాణ హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్, 2025 ఫిబ్రవరి 25న ట్రయల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా పాటించారని, కేవలం "పోస్ట్ ఆఫీస్"లా వ్యవహరించారని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేసులను పునరుద్ధరించి, విచారణను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది.హైకోర్టు తీర్పును రవిప్రకాశ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, తాజాగా ఆయన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ నిర్ణయంతో కేసుల విచారణలో రవిప్రకాశ్ దోషి లేదా నిర్దోషి అని తేలలేదు.

# అనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి చెందిన సంస్థకు కేటాయించిన భూములను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించింది. భూముల కేటాయింపు జరిగిన ప్రాంతానికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు అక్కడి నుంచే మీడియాతో మాట్లాడి ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేశారు.రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించారంటూ ఆరోపణ, సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టారని విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపుపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి అన్నదమ్ములకు నో రూల్స్ అంటూ కేటీఆర్ విమర్శలుఅనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. లక్ష రూపాయల చెల్లింపు మూలధనంతో, కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని సంస్థకు ఇంత విలువైన రక్షణ రంగ ప్రాజెక్టు భూమిని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఒక రకమైన నిబంధనలు, సామాన్య ప్రజలకు మరో రకమైన నిబంధనలు అమలు చేస్తున్నారనే భావన కలుగుతోందని విమర్శించారు.

**ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో భూముల దందా:**

ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో వెనుకబడిన ప్రాంతాల భూములను ప్రభుత్వం సేకరిస్తూ, వాటిని సంస్థల ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. షెల్ కంపెనీల పేరుతో బంధువుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వ భూముల కేటాయింపులు, వాటి వెనుక ఉన్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నిరుపేదల భూములు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగించడంతో పాటు న్యాయపరంగానూ ముందుకు వెళ్తుందని వారు స్పష్టం చేశారు.

# కేసీఆర్ టార్గెట్‌తో గులాబీ దళం యాక్టివ్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్‌కు లాభమా లేదా నష్టమా అనేది చర్చనీయాంశమైంది. నేటికీ కేసీఆర్ పట్ల తెలంగాణను తెచ్చారన్న అభిప్రాయం ఉంది. ఆయన పాలన శైలి నచ్చకపోవచ్చు కానీ, ఆయనంటే తెలంగాణ ప్రజలకు గౌరవం అనేది తరగనిది. కానీ కాంగ్రెస్ ఇటీవల కాలంలో కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం రాజకీయంగా నష్టమేనన్న అంచనాలు వినపడుతున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని చెప్పడం, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం వంటివి బీఆర్ఎస్ కు కలిసి వచ్చే అంశమని భావిస్తున్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నేతగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి. ఆయనపై వ్యక్తిగత విమర్శలు లేదా తీవ్రమైన దాడులు ప్రజల్లో ఆయన పట్ల సానుభూతిని పెంచే అవకాశం ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీలు, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రతిపక్ష నేతను వేధించడానికే ప్రాధాన్యత ఇస్తోందనే అభిప్రాయం సాధారణ ప్రజల్లో బలపడితే అది కాంగ్రెస్‌కు రాజకీయంగా నష్టం కలిగిస్తుంది. కేసీఆర్ శాసనసభకు రాకుంటే, ప్రజాసమస్యలను ప్రస్తావించకుంటే ఆయనకే నష్టం. ఎన్నికల సమయంలో జనం తగిన రీతిలో తీర్పు చెబుతారు. కేసీఆర్ కేవలం అసెంబ్లీ సమావేశాలకు మాత్రేమే కాదు...ప్రజా సమస్యలపై రాష్ట్రంలో పర్యటించలేదు. కానీ కేసీఆర్ సభకు రాలేదంటూ నిరసనలు తెలియజేయడం, ఎమ్మెల్సీ స్పీకర్ ను తిడితే ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం కొంత కాంగ్రెస్ కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.. కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల నిస్తేజంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ ఒక్కసారిగా అప్రమత్తమై, కాంగ్రెస్ సర్కార్‌పై ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది.అయితే కాంగ్రెస్‌కు లాభం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. కాంగ్రెస్ ఎజెండా ప్రకారం బీఆర్ఎస్, కేసీఆర్‌లను నిరంతరం టార్గెట్ చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్సేనని, బీజేపీకి అక్కడ చోటు లేదనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపవచ్చు. దీనివల్ల ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా చూసుకోవచ్చు కేసీఆర్ హయాంలో జరిగిన లోపాలను (ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలు, ధరణి లోపాలు) నిరంతరం ప్రస్తావించడం ద్వారా, తాము ఎందుకు అధికారంలోకి రావాల్సి వచ్చిందో ప్రజలకు కాంగ్రెస్ సమర్థించుకోగలుగుతుంది. తమ నాయకత్వం బలంగా ఉందని, కేసీఆర్ వంటి సీనియర్ నేతను సైతం ఢీకొట్టగలదని చూపించడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలలో ధైర్యాన్ని నింపవచ్చు. .. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, అది వ్యక్తిగత దూషణలు, శృతిమించిన దాడుల స్థాయికి వెళ్తే మాత్రం కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు ఎప్పుడూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలును బట్టే తీర్పు ఇస్తారు కానీ, కేవలం ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం వల్ల మాత్రమే ఓట్లు పడవు.

# నిర్మాణంలో ఉండగానే కూలిపోయిన బ్రిడ్జి

పాట్నా : నిర్మాణంలో ఉన్న నాలుగు లేన్ల వంతెన ఒక్కసారిగా కుప్పకూలిన ఘటన బీహార్‌లో తీవ్ర కలకలం రేపింది. భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనుల్లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వైశాలి జిల్లా లాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇత్వార్‌పూర్ గ్రామం సమీపంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.నాలుగు లేన్ల రహదారిలో భాగంగా వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో.. వంతెన నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ లాంచర్ (ఇనుప నిర్మాణం) అకస్మాత్తుగా కుప్పకూలింది. ఆ సమయంలో నిర్మాణ ప్రాంతంలో పలువురు కార్మికులు పనిచేస్తున్నారు. లాంచర్ కూలిపోవడంతో సుమారు ఏడుగురు కార్మికులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న కార్మికులు, స్థానికులు స్పందించి గాయపడిన వారిని లాల్‌గంజ్ రెఫరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి ప్రాథమిక చికిత్స అందించారు. గాయపడిన వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం సదర్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. మరికొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. మెరుగైన వైద్యం అవసరమైన వారిని హాజీపూర్‌కు తరలించినట్లు తెలుస్తోంది. గాయపడిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, జిల్లా పరిపాలనా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వైశాలి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శుభాంక్ మిశ్రా, సబ్–డివిజనల్ పోలీస్ ఆఫీసర్ గోపాల్ మండల్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కూలిపోయిన లాంచర్‌తో పాటు నిర్మాణ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు.ప్రమాదం నేపథ్యంలో నిర్మాణ పనుల సమయంలో కార్మికుల భద్రతకు తీసుకున్న చర్యలపై స్థానిక గ్రామస్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిర్మాణ ప్రాంతంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించలేదని కొందరు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రమాదం అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారని గ్రామస్థులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు ఇప్పటివరకు అధికారికంగా ధృవీకరించలేదు.

అసలు ప్రమాదానికి కారణం ఏంటి?

లాంచర్ అకస్మాత్తుగా ఎందుకు కూలిపోయిందన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సాంకేతిక లోపం కారణమా? నిర్మాణంలో ఏదైనా పొరపాటు జరిగిందా? లాంచర్ సామర్థ్యానికి మించి భారం పడిందా? లేక భద్రతా ప్రమాణాల అమలులో లోపాలు ఉన్నాయా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ సంస్థ పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, ఉపయోగిస్తున్న యంత్రాలు, నిర్మాణ విధానం తదితర అంశాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ప్రమాదానికి ఖచ్చితమైన కారణం వెల్లడయ్యే అవకాశం ఉంది.దేశవ్యాప్తంగా కీలక రహదారి మౌలిక సదుపాయాల నిర్మాణంలో భాగంగా చేపడుతున్న భారత్‌మాల ప్రాజెక్టులో ఈ ఘటన చోటుచేసుకోవడంతో నిర్మాణ కార్మికుల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.

# మామను తుదముట్టించిన కోడలు

కాన్పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సంచలనం సృష్టించిన ప్రముఖ కోటీశ్వరుడు, ఔషధ వ్యాపారి వినీత్ మినోచా హత్య కేసు మిస్టరీని పోలీసులు చేధించారు. ఈ ఘోర హత్యకు స్వయంగా ఆయన కోడలు శాలు మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించినట్లు పోలీసులు వెల్లడించారు. తన విలాసవంతమైన ఖర్చులపై మామగారు ఆంక్షలు విధించడమే కాకుండా, డబ్బు విషయంలో కఠినంగా ఉండటంతో కక్ష పెంచుకున్న కోడలు.. ఏకంగా రూ. 6 లక్షల సుపారీ ఇచ్చి ఈ దారుణానికి ఒడిగట్టింది.

పార్టీ నెపంతో పక్కా ప్లాన్:పోలీసుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి శాలు, ఆమె భర్త సుబ్రత్ తమ 6 ఏళ్ల కుమారుడితో కలిసి రాత్రి 9:36 గంటల ప్రాంతంలో ఒక పార్టీకి వెళ్లారు. వారు వెళ్లిన 10 నిమిషాలకే ఇంట్ నుంచి తీసేసిన పాత నౌకరు విశాల్, అతని స్నేహితుడు రాజ్‌కిషోర్ నకిలీ తాళాలతో ఫ్లాట్ లోపలికి ప్రవేశించారు. సుమారు గంటన్నరపాటు ఇంట్లోనే దాక్కుని, వినీత్ మినోచా రాక కోసం వేచి చూశారు. గుండెపోటుగా చిత్రీకరించాలని చూసి.. చివరికి కత్తులతో:నిజానికి వినీత్ మినోచా పడుకున్న తర్వాత దిండుతో ముఖంపై నొక్కి ఊపిరాడకుండా చేసి, అది గుండెపోటు లేదా సహజ మరణంగా నమ్మించాలని నిందితులు ప్లాన్ చేశారు. కానీ రాత్రి 10:58 గంటలకు ఇంటికి వచ్చిన వినీత్, ఊహించని విధంగా పిల్లల గదిలోకి వెళ్లారు. అక్కడ దాక్కున్న నిందితులను చూసి ఆయన కేకలు వేయబోగా, భయపడిపోయిన హంతకులు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో ఆయన గొంతు, ఛాతిపై విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చారు.

**కన్నీరు కార్చిన కోడలు.. సీసీటీవీతో దొరికిన ఆధారాలు:**

ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు పార్టీ ముగించుకుని కొడుకు, కోడలు ఇంటికి వచ్చేసరికి వినీత్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఘటన తర్వాత మామగారు అంటే తనకు ఎంతో ఇష్టమంటూ కోడలు శాలు పోలీసుల ముందు విపరీతంగా ఏడుస్తూ డ్రామా ఆడింది. అయితే ఇంట్లో ఎలాంటి నగదు, నగలు చోరీ కాకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది.అపార్ట్‌మెంట్ లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, 6 ఏళ్ల క్రితం దొంగతనం ఆరోపణలపై